
లౌకిక జీవనము - ఆధ్యాత్మికత

(శ్రీ మాస్టారి ఉపన్యాసము)



పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

లౌకిక జీవనము – ఆధ్యాత్మికత

లౌకికమైన జీవితం, ఆధ్యాత్మికమైన జీవితం వేరు అనే అడ్డుగోడలు ఏమీ లేవు. ఈ రెండు వేరు చేయడానికి అవకాశం లేదు. ఈ ప్రాపంచికమైన జీవితం వేరు, ఆధ్యాత్మికమైన జీవితం వేరు అనే విభజన భగవంతుడు ఒప్పుకోడు. రెండూ కలిపి ఒక తాటి మీద నడవడం చేతనయిన తరువాతనే మనిషికి లౌకికమైన శ్రేయస్సు ఉంటుంది. పారమార్థికంగా కూడా మేలు జరుగుతుంది. ఈ మాట ప్రతి మత గ్రంథంలోనూ ఉంది. వేదాలలో ఉంది, ఉపనిషత్తులలో ఉంది. పురాణాలలో ఉంది. భగవద్గీతలో ఉంది. ఖురాన్ లో ఉంది. బైబిల్‌లో ఉంది. ఇన్నిట్లో ఉన్నా సరే, (ప్రతిదేశంలో ఆయన ఇలా చెబుతున్నా సరే, ప్రతిదేశంలోనూ 90 శాతం మనుషులు ఇది వేరు, అది వేరు అంటారు. వాళ్ళు చెప్పినది మాత్రం సుతరామూ అర్థం చేసుకోరు. వీడు ఏది అనుకుంటాడో అది వారు చెప్పార నుకుంటాడన్నమాట.

ఈ ప్రపంచంలో ఏ మత గ్రంథం తీసినాసరే, ప్రాపంచికమైన జీవితం వేరు, పారమార్థిక జీవితం వేరు అనేటటువంటి గిరిని అంగీకరించలేదన్నమాట. రెండూ కలిపి ఒకటిగానే ఉంటాయి. ఎట్లా? మనకు కొబ్బరికాయ ఒకటిగా దొరుకుతుంది. ప్రకృతిలో మనం కొట్టకముందు ఎలా ఉందో అలా తయారవుతుంది. కానీ మని షేంచేస్తాడంటే కత్తి పెట్టి దాన్ని రెండుగా కొట్టి, రెండు భాగాలుగా విభజన చేస్తాడు. ఒకటి ప్రాపంచికమైన జీవితం, రెండవది పారమార్థిక జీవితం అంటాడు. అందుకని ఎప్పుడూ ఇలాగే బోధిస్తూ వస్తారు. దానివల్ల మనకు ప్రపంచంలో రెండు రకాల మనుషులు కనిపిస్తారు.

భగవంతుడు, ధర్మము ఇలాంటివేమీ నమ్మకుండా పచ్చిగా ప్రాపంచికంగా ఉండేవాడన్నా కనబడతాడు. లేదా దేవుడు, ధర్మమూ అంటూ బాధ్యతలను అశ్రద్ధ చేసేవాడన్నా దొరుకుతాడు. వాడు ఒక రకంగా చెడతాడు. వీడు ఇంకొక రకంగా చెడతాడు. అందుకని ప్రపంచలో ఇన్ని మతాలు వచ్చినా, ఇంత మంది గొప్పవాళ్ళు వచ్చి ఇన్ని బోధలు చేసినా, ప్రపంచంలో నిజంగా ఆధ్యాత్మికంగా పైకి పోయే వాళ్ళు చాలా కొద్దిమంది ఉంటారు. ఇప్పుడు మన ధర్మాన్ని తీసుకున్నామనుకోండి. ఈ ధర్మంలో ఏమవుతుంది? దేవుడు

ఉన్నాడు. ధర్మము అని నమ్మేవాడు ప్రతివాడూ, దాదాపు నూటికి తొంభైమంది ఏం చేస్తారు? ఇది ఐహిక జీవితం, ఇది ప్రాపంచికమైనది, ఇది తుచ్ఛమైనది, ఇది అశాశ్వతమైనది, దీనిమీద మనస్సు నుంచకుండా తీసివేయాలి అంటాడు. పారమార్థికమైన జీవితాన్నే పెట్టుకోవాలంటాడు.

మధ్యాహ్నము నా దగ్గరుండే రామారావు చీరాల నుండి వచ్చాడు. అక్కడ కొంతమందితో పరిచయమై వాళ్ళు చెప్తూ వచ్చారు. బాగా సన్నిహితమైన పరిచయం, పెద్ద పెద్ద వాళ్ళ సేవ కూడా చేశారు. ఆయనేం చేస్తారంటే, చాలా మంచి భక్తుడు, కాస్తా కూస్తా భక్తుడు కాడు. అయినా కానీ ఇంటిలో కూరలు ఉన్నాయో లేదో కనుక్కోడు, డబ్బులున్నా సరే. ఇంట్లో కూతురుకుకానీ, భార్యకు కానీ ప్రమాదంగా జబ్బుచేసి వుండి ఆస్పత్రికి తీసుకువెళ్ళటానికీ వెళ్ళడు. రిక్షా దొరికితే వెళ్ళండి. ఎవరన్నా అక్కడ దొరికితే మందులు తెచ్చుకోండి. దొరక్కపోతే అంతే, మీ ప్రాప్తం అట్లా వుంది. మీ ఖర్మ బుణానుబంధం. మీకూ నాకూ బుణానుబంధం తప్ప ఏమీ లేదు. అందుకని ఇది పారమార్థికానికి సంబంధించినది. కాబట్టి ఏ విధమైన సంబంధం, దానితో నాకేమీ లేదు అని చెబుతాడు. ఇలా తయారవుతారు. బిడ్డలను కూర్చొబెట్టుకొని చదువు చెప్పలేరు. భార్యాబిడ్డల ఆరోగ్యం గురించి పట్టించు కోలేరు. బాధ్యతలు తీసుకోలేరు. తీసుకుంటే? ఇంక పరమార్ధం సంగతి మర్చిపోయి వీటినే పట్టించుకుంటారన్న మాట. లౌకికమైన సంగతే పట్టించుకుంటారు. ఇలాంటి వాళ్ళన్నా కనబడతారు మనకి సమాజంలో. లేకపోతే పరమార్ధం సంగతి చెప్పి ఇవన్నీ అశ్రద్ధ చేసేవాడన్నా దొరుకుతాడు. అంటే అర్థమేమిటన్నమాట? శరీరంలో ఒక భాగం చచ్చుపడి పోయిందని అర్థం. ఒకడికి పరమార్థం అనే భాగంలో శరీరం చచ్చుపడిపోయింది, ఇంకొకడికి ఐహికమైన దాంట్లో చచ్చుపడి పోయింది. కానీ మనిషన్న వాడికి రెండు శరీర భాగాలు సక్రమంగా ఉండాలి. అలా ఉన్నవాడు మాత్రమే ఆరోగ్యమైన మనిషి. అందుకని ఇహమూ, పరమూ రెండూ ఎప్పుడూ (సరైనవిగా) శ్రేయస్కరంగా ఉండటం ఒక్కటి మాత్రమే సరైన పద్ధతి, ఆధ్యాత్మికతలో ఇది మొట్టమొదలు. ప్రపంచలో ఎన్ని మతాలయితే ఇంతవరకూ వచ్చాయో, అన్ని మతాలు అలాగే చెప్పాయి. ఇది కాదనుకొని, ఈ ఐహికమయినది అశాశ్వతము, ఇది భ్రాంతి, ఇది మిథ్య, ఇది మాయ, ఇది

అంతా వట్టిది అనే కబుర్లు నేర్చుకున్నారు. మొట్టమొదలు మనిషి తెలుసుకోవలసినది ఇది. అందుకే సత్సంగంలో మందిరంలో కూడా చాలాసార్లు వచ్చింది ఈ విషయం.

హిమాలయ పర్వతాల్లో ఒక మహాత్ముడి దగ్గర సేవ చేస్తున్నాడు ఒకాయన. మూడు మాసాలున్నాడు, ఆరు మాసాలున్నాడు. సంవత్సరం ఉన్నాడు. గురువుగారు వీడికేమీ బోధించటంలే. నువ్విట్లా ధ్యానం చెయ్యి, నువ్వు అట్లా ధ్యానం చెయ్యి. ఇంతసేపిలా శ్వాస ఆపు అలాగా, ఇలాగా అని ఏం చెప్పటంలే! ఆశ్రమంలో ఉన్న అందరూ తలా ఒక పని చేస్తుంటారు. ఒకడు చిమ్ముతాడు, ఒకడు తోటపని చేస్తుంటాడు, ఒకడు కూరలు తరుగుతాడు, ఇంకొకడు చెంబులు తోముతాడు, వంట చేస్తుంటాడు, ఇంకొకడు వడ్డిస్తుంటాడు. తలా ఒకడు తలా ఒక పని చేసుకుంటారు. కానేపు ఏదయినా సద్గ్రంథం చదువుతారు. ఆ సద్గ్రంథం అందరూ కూర్చొని వింటారు. ఆశ్రమం కాబట్టి కొన్ని నియమాలుంటాయి. ఇన్ని గంటలకు నిద్రలేస్తారు, ఇన్ని గంటలకు నిద్రపోతారు. ఇట్లా నియమాలుంటాయి. ఇందులో ఒక శిష్యుడు ఏం చేశాడంటే, "వీళ్ళంతా వట్టి అమాయకులు. ఊరికే పడున్నారిక్కడ ఆయనేం చెప్పా పెట్టకుండా ఉంటే. మూడేళ్ళనుండి ఉన్నవాళ్ళు ఉన్నారు, నాలుగేళ్ళనుండి, పదేళ్ళనుండి ఉన్నవాళ్ళున్నారు. ఈయన చెప్పేది ఏమిటసలు? ఏం చెప్పడే ఎన్నాళ్ళకీ? తింటూ ఉండడమేనా ఇట్లా? ఈ చెంబులు తోముకోడం, ఇది చెయ్యడం, అది చెయ్యడమేనా? అని వాడికి చిర్రెత్తింది" అంటే వాడేమను కున్నాడన్నమాట? గురువుగారి కంటే తనకి బాగా తెలుసనుకున్నాడన్నమాట. ఆ జబ్బు తగ్గడం చాలా కష్టం. వాడికి తెలిసినమాట నిజమయితే వాడక్కడ వుండడు. అదే గుర్తు. నువ్వు చెప్పేది తప్పు నాకు బాగా తెలుసు అన్నాడనుకోండి. మరి నీకు తెలిసుంటే ఇంకా మా మధ్యన ఉన్నావే? ఒకటే ప్రశ్న నువ్వు చెప్పే పంథా సరిగాలేదు. నేను చెప్పేది సరైనది అన్నాడనుకోండి. నువ్వు మా మధ్యలో ఇంకా ఎందుకు ఉన్నావని అడిగేది. కాబట్టి నువ్వు చెప్పేది రైటు కాదనటానికి నువ్వే ఋజువు. ఇంకెవడో అక్కర్లే. ఎవడో వైద్యుడు వచ్చాడు. నా దగ్గర ఒక మందుంది ఈ భూమిమీద ఎట్లాంటి జబ్బయినా తగ్గిపోతుంది. ఈ మందుతో నువ్వు ఏమనుకున్నావో అన్నాడు.

ఒక అరగంటాగి ఎవడో విడిగా, వీడి దగ్గర నాడి చూపించుకోవడానికి వెళితే, దగ్గుతున్నాడు ఆ డాక్టరు, 15 నిమిషాలు సేపు ఆగకుండా. వాడు చెప్పిందే నిజమయితే వాడికి ఎందుకుందా జబ్బు? అది చాలు. ఇక వెళ్ళిపోవచ్చు అన్నమాట, వాడి దగ్గరకెళ్ళుకుండా. ఇంక వేరే బుజువక్కర్లా. అందుకని ఏంచేశాడు.

"గురువుగారూ ఇంతేనా, మీరిక్కడ చెప్పేదంతా ఇంతేనా? అని" అడిగాడు అంటే "నీకిప్పుడు ఏం కొరవైంది, దేని గురించి కావాలి చెప్పు" అన్నారు గురువుగారు. అంటే "ఇంద్రియాలకు అతీతమయినటువంటిది ఆ, అదేదో ఉంది గదా! దాని గురించి చెప్పటం, ఏవో ప్రాణాయామం ఇవేవో చెప్పడం, బోధ చేయడం ఏమీ లేదా?" అన్నాడు. "నీకు అవసరమయితే చెబుతాను. నీకు అవసరమైందో లేదో నాకు తెలుసు" అన్నారు. అంటే శిష్యుడు అన్నాడు "మీరు ఇట్లా అంటున్నారు. ఫలానా చోట, ఫలానా ఆశ్రమం ఉంది. ఓ! అక్కడ వందలమంది, వేలమంది శిష్యులు ఉన్నారు. ఆయన ఎప్పుడూ ఇది బోధిస్తాడు, అది బోధిస్తాడు. ఆ మార్గం బోధిస్తాడు. మీరు ఏ మార్గం బోధించడం లేదు. ఇప్పుడు మీరు చెప్పండి, మీకంటే ఆయన ఉత్తములా కాదా? మీకంటే ఆయన మెరుగైన బోధ చేస్తున్నాడా లేదా?" అన్నాడు.

"అది నన్నడిగితే ఏం లాభం లేదు. నేనెప్పుడూ ఆయన దగ్గర శిష్యరికం చేసి ఆయన ఎట్లాంటివాడో తెలుసుకోటానికి ప్రయత్నం చేయలేదు. నువ్వు కొంతకాలం అక్కడుండు. అయితే ఉండినప్పుడేం చేస్తావంటే, పూర్వాశ్రమంలో భార్య, బిడ్డలతో ఎట్టా ఉన్నాడో కనుక్కో ముందు. కాఫీలో చక్కెర వెయ్యలేదని పెళ్ళాన్ని తిట్టకుండా ఉన్నాడా? లేదా? చీటికీ మాటికీ ఆమె నెత్తిమీద (ఏదైనా) వేసి కొట్టకుండా ఉన్నాడా? లేదా? అలిగి అన్నం తినడం మానెయ్యకుండా ఉన్నాడా? లేదా? ఇట్టా కాకుండా, ఇంట్లో పనివాళ్ళతోటి, ఇంట్లో భార్య బిడ్డల తోటి, ఇంటికొచ్చిన వాళ్ళతోటి వీళ్ళందరితోటి హాయిగా, సంతోషంగా, ఉండగలిగాడా? లేదా? ముందు అది కనుక్కురా అన్నాడు. వీడికింకా కాస్త మండిపోయింది. ఆయనకు జ్ఞానం ఎంత ఉందో అడిగితే బాగుంటుంది. శక్తి ఎంత ఉందో అడిగితే బాగుంటుంది. అదేమీ లేకుండా ఇది అడుగుతాడేమిటీయన? అని వాడికింకా చిరాకు పుట్టింది ఇదెట్లాగండీ

మీరడిగేది అంటే "అప్పుడన్నారు (గురువు) నువ్వు ముందు ఆ సంగతి చూసిరా. నేను మళ్ళా చెబుతాను సమాధానం అన్నారు. నువ్వసలు చూసుకొచ్చి, విషయమేంటో కనుక్కొచ్చి మాట్లాడు. తరువాత చెబుతాను" అదేమిటని అడిగితే అన్నాడు. "ఆయనికి కనుక ఆధ్యాత్మికపూర్ణత ఉన్నట్లయితే అందరు మనుషులతోనూ ప్రేమగానూ, ఆదరణగానూ, సక్రమంగానూ ఉండగలగడం చేతనయితే, ఆ తరువాత వాడికి ఆధ్యాత్మికత ఏమైనా తెలుస్తుంది, చేతనవుతుంది. అదే చేతకాకుండా, నాకు ఆధ్యాత్మికత ఏదో చేతనైందనుకుంటే మాత్రం వట్టి పొరపాటు. అంటే మా భగవద్గీతలో అట్లా చెప్పలేదు. "అసలు భగవద్గీతలో ఏం చెప్పాడో తెలుసా? ఓ! యబ్బా చానా సార్లు విన్నాం! అసలు ఏమయినా గుర్తుందా?" ఉండదు. విన్నప్పుడు చాలా బాగుంటుంది కానీ, అందులో ఏం చెబుతున్నాడో మాత్రం గుర్తుండదు. గుర్తున్న యెడల ఎవ్వడూ ఇట్లా మాట్లాడ్డానికవకాశం లేదు. భగవద్గీతలో ఏం చెబుతున్నాడూ? ఆధ్యాత్మికత కోసం భగవంతుడు గురించి ధర్మశాస్త్రాలలోవి కూడా తెలిస్తే కానీ భగవద్గీత పూర్తిగా అర్థం కాదు.

భగవద్గీతలో ఏం అంటున్నాడంటే, తపస్సు చేయడం అనేది దేవతలూ చేశారు. మనుషులూ చేశారు, రాక్షసులూ చేశారు. ముగ్గురికీ ఈశ్వర సాక్షాత్కారం అయింది. కానీ ఫలితం ఏమయింది? దేవతలేమో ఇంద్రాది పదవులడిగారు, చావులేకుండా ఉండే స్థితి అడిగారు, వారికి స్వర్గం వచ్చింది. స్వర్గ సుఖాలు ఉన్నాయి. రాక్షసులు ఏం చేశారు? వాయువు అందరూ నా చెప్పుచేతల్లో పడి వుండాలి. సూర్యుడు నా చెప్పుచేతల్లో పడుండాలి, దేవతలు నా చెప్పుచేతల్లో పడుండాలి అని వరాలు కోరి అవి పొంది అందరినీ చావగొట్టడం మొదలు పెట్టారు. వీడు తపస్సు చేసి ఈశ్వర సాక్షాత్కారం పొందాక కూడా, వాళ్ళందరినీ చావగొట్టడం అనే బుద్ధి పోలేదు వీడికి. శుకుడు, వశిష్టుడులాంటి వంటి కొద్ది మంది మహాత్ములు మాత్రం బ్రహ్మజ్ఞానులై ఉన్నారు. ఎవరి ముందయితే దేవతలు తల వంచి మోకరిల్లవలసి వస్తుందో, అటువంటి స్థితిలో ఉన్నారు. ముగ్గురూ తపస్సు చేశారు. ముగ్గురికీ పరమేశ్వర సాక్షాత్కారం అయింది. కానీ శుకుడు, వశిష్టుడులాంటి వాళ్ళేమో పూర్ణ బ్రహ్మజ్ఞానులయ్యారు. ఇంక పొందాల్సిన స్థితి అంటూ ఏమీ లేకుండా

అయ్యారు. రాక్షసులు మాత్రం వరాలు కోరుతూనే ఉన్నారు, ప్రమాదంలో పడుతూనే ఉన్నారు. ఏమిటి వచ్చింది? రాక్షసులు వరాలు కోరారు, వారికి వరాలు చేకూరడం వల్ల ఏమీ ఒరగలా, చివరకు చచ్చే పొయ్యారు. అన్ని వరాలు కోరిన తరువాత కూడా చచ్చాడు. వీడు ఎన్ని వరాలు కోరితే అన్ని వరాలూ ఇచ్చాడు. వీటివేటికీ అడ్డంలేని రీతిన వాణ్ణి చంపాడు. హిరణ్యకశిపుణ్ణి గురించి వింటంలా మనం? ఇంట్లో చావకూడదు, బయట చావకూడదు, పగలు, రాత్రి, మనిషి చేతులో, దేవతల చేతిలో, జంతువు చేతిలో, ఆయుధంతో చావకూడదు, ఇట్లా కోరాడు. అలాగే అన్ని వరాలూ ఇచ్చాడు. కానీ ఇవేవీ కాని రీతిన కొట్టేశాడు. పగలు, రాత్రి కాని సంధ్యవేళ, ఇంట్లోనూ, బయటా కాకుండా గడప మీద, నేల మీద, ఆకాశం మీద కాకుండా ఒడిలో, ఆయుధాలతో కాకుండా గోళ్ళతోనూ, జంతువ, మనిషి, దేవత కాకుండా మూడింటి కాంబినేషన్, ఎగిరేపోయాడు. ఇన్ని వరాలూ కోరి తపస్సు చేసిందంతా ఏమయిందీ? ఇన్నీ కలసి రక్షించలా, తీసి అవతల పారేసింది. చేసిన తపస్సంతా వ్యర్థమయింది. వరాలు కోరినట్టే ఉంది. వస్తున్నట్టే ఉంది, అన్నీ పోయినాయ్. ఇంతా చేసి వాడు తపస్సు దేని కోసం చేశాడో ఆ పని నెరవేరలా! ఈ లోపల నలుగురిని తన్నాడు, ఆ తరువాత వాడు నాలుగు తిన్నాడు. అంతకంటే ఏమీ ఒరగలా. అట్లా కాకుండా ఇంద్రాది పదవులు కోరారు. ఇంద్ర పదవి వచ్చింది. అది కూడా వచ్చినట్టేగా? అంటే అట్లా ఏమీ కాదు. ఎవరు తపస్సుచేసి పైకి వచ్చినా కానీ, మొట్టమొదట రాక్షసులు తన్నేది ఇంద్రుణ్ణే. మొదటి తన్నులు వాడికే వస్తాయి. ఈ కాలంలో కాపీలు పట్టుకునే టీచర్లకులా, కాపీలు పట్టుకున్నాడో ముందు వాడికే పడతాయి, ఇంకొకడి సంగతి తరువాత. అలాగే ముందు చెందేదంతా ఇంద్రుడికే. అందుకని వాళ్ళు అంత ఇంద్ర పదవులలో ఉండి, కొంగల్లే ఒంటికాలు మీద ఉండి, ఎవడు తపస్సు చేస్తున్నాడా, ఎవడన్నా పైకి వస్తాడేమో, వాడి దుంపతెగ రేపు తంతాడేమో అని చూసుకుని, వాడి తపస్సు చెడగొట్టడం కోసం ప్రయత్నించడమే వాడి పని. ఇంక వాడు సుఖంగా ఉండి చచ్చిందెక్కడ? ఇన్ని కోట్ల జీవరాశులు ఉండేటటువంటి ఈ భూమి మీద ఎవడు, ఏ మూల తపస్సు చేస్తున్నాడో, ఎక్కడ వస్తాడో, రేప్పొద్దున్న వాడేం చేయబోతున్నాడో అని వాడికి B.P తప్ప ఇంకేమైనా ఉంటుందీ?

తాడి చెట్టు మట్ట మీద కుర్చీ వేసి కూర్చోబెట్టినట్టు వాణ్ణి. తూగాడా క్రింద పడతాడు. గట్టిగా దగ్గాడా, తుమ్మాడా, క్రింద పడతాడు. ఊపిరి గట్టిగా పీల్చాడా, క్రింద పడతాడు. ఇక ఊపిరి బిగబెట్టుకొని, తుమ్మడానికి వీల్లేకుండా, దగ్గడానికి వీల్లేకుండా, తూగడానికి వీల్లేకుండా ఆపైన కూర్చొనే కంటే, మురికిగుంట ప్రక్కన పడుకుంటే హాయి. క్రింద పడ్డానికి వీల్లేకుండా! వాడు సుఖంగా ఉంటాడు.

కానీ చెయ్యటమా, ముగ్గురూ తపస్సు చేశారు. ముగ్గురికీ ఈశ్వర సాక్షాత్కారం అయింది. కానీ ఒరిగిందేముంది? ఒక్క బ్రహ్మజ్ఞాని మాత్రమే పొందాడు. ఇంక పొందవలసిందంటూ ఏమీ లేకుండా పొందాడు. మరణమనే భయంలేదు. వాడు ఆత్మ స్వరూపం అని వాడికి తెలిసింది. చచ్చిపోతామేమో, బ్రతుకుతామేమో అనే భయం వాడికి లేదు. ప్రపంచం మిద్య ఆని తెలిసింది. అంతటా బ్రహ్మమే అని తెలిసింది. కాబట్టి వాడికి కావలసింది లేదు, వద్దనేది లేదు. ఇంక వాడు దేన్ని చూసి భయపడాలి? దేన్ని చూసి భయపడవలసిన అవసరమూ లేదు. దేనినీ కోరవలసిన అవసరమూ లేదు. ఇంక ఏదీ ఇవ్వలేని ఆనందాన్ని పొందుతూనే ఉన్నాడెప్పుడూ! వాడొక్కడు మాత్రమే సక్రమంగా చేసుకున్నవాడు. తక్కిన వారిద్దరూ ఈశ్వర సాక్షాత్కారం పొంది కూడా ఏమీ పొందని వాళ్ళయ్యారు. మామూలుగా చాలీచాలని బ్రతుకు బ్రతికే వాడికి సమాజంలో ఏమనిపిస్తుంది, కాస్త పుష్కలంగా మంచి ఇల్లు, కాస్త తింటానికి తిండి, బ్యాంకు బ్యాలెన్సు, నాలుగు డబ్బులు ఉంటే ఎంత హాయిగా ఉంటుందనిపిస్తుంది. ఇప్పుడట్టా అనిపిస్తుంది. అక్కడి దాకా వచ్చాక, అక్కడి నుండి క్రిందపడితే, ఏమో అనిపించి అక్కడి నుండి రెండు అడుగులు పైకి వెళదామనిపిస్తుంది. ఎక్కడికక్కడ అలాగే క్రింద పడే ప్రమాదమెక్కువై రెండడగులు పైకి ఎక్కుతూనే ఉండాలనిపించి, ఇక ఆగడానికి లేదు. భయం ఎక్కువై పోతుంది. ఈ కాస్తపోతే ఏమై పోతుందో అని భయమేస్తుంది. అందుకని జాగ్రత్తగా గనుక ఆలోచించినట్లయితే, తపస్సు చేయడం వల్ల మాత్రమే ఏమీ ఒరగదు. ఈశ్వరుడు సాక్షాత్కరించడం వల్ల కూడా ఏమీ ఒరగదు. ఇవన్నీ ఎప్పుడు సార్థకమవుతాయి? అంటే వశిష్టుడు, శుకుడు, విశ్వామిత్రుడు బ్రహ్మర్షి అవడానికి, ఎలా చేశారో అలా చేయడం చేతనైతే అప్పుడు వాడికేమైనా

దక్కుతుంది, లేకుంటే మనం డబ్బుకోసం పాటుపడితే ఏమైందో, పదవికోసం పాటుపడితే మనం ఎన్ని కష్టాలు పడ్డామో వాళ్ళక్కూడా ఇవే ఉంటాయి. ఇది ముందు జాగ్రత్తగా చూసుకోవాలి. అందుకనే ధర్మశాస్త్ర గ్రంథంలో ఏం చెబుతారంటే, ఇవి చెప్పరు. గీతోపన్యాసాలు చేసేవాళ్ళెవరూ చెప్పరు. కానీ నిజానికి గీతలో ఉండే చాలా శ్లోకాలు మనుస్మృతిలో యాజిటీజ్‌గా ఉన్నాయి. మాట కూడా మార్పు లేకుండా మనుధర్మశాస్త్రంలో ఉండే శ్లోకాలు దాదాపు 30, 40 శ్లోకాలు వరకూ భగవద్గీతలో ఉన్నాయి. అలా ఎందుకున్నాయో చూసుకోరన్నమాట.

అందులో ఏం చెబుతారంటే (మనుస్మృతిలో) "ఋణానుబంధాలు, నువ్విచ్చినటువంటి వాగ్దానాలు, చేసిన ప్రమాణాలు, నీ బాధ్యతలు, నిర్వర్తించక ముందు గనుక బ్రహ్మానుభూతి కోసం ప్రయత్నం చేశావో, పాడైపోతావు! అన్నారు".

చెప్పమనండి ఈ స్వాములవార్లని ఒక్కరిని వేదిక మీద కొచ్చి ఆ మాట! ఈ గీతోపన్యాసాలు, వేదాంతోపన్యాసాలు, ఈ చింతకాయ ఉపన్యాసాలన్నీ చెప్పే వాళ్ళంతా ఉన్నారే, అసలు ధర్మశాస్త్రమే తెలియదు వాళ్ళకి. ధర్మశాస్త్రంలో మొట్టమొదట ఏం చెప్పాడు? ఈ మాట చెప్పారు.

ఋణానుబంధాలు హృదయపూర్వకంగా ఎవడైతే తీర్చుడో, బాధ్యతలు ఎవడైతే తీర్చుడో, వాడు చేసిన వాగ్దానాలు ఎవడైతే తీర్చుడో, అవన్నీ అయిన తరువాత ఆధ్యాత్మికత తప్ప, ఈ లోపలంతా ఏమిటంటే, ఆ తరువాత ఆధ్యాత్మికత చేయాలనేటటువంటి బుద్ధి మిగలటం కోసం జాగ్రత్తపడాలి ఇప్పుడు. ఎట్లా? రేపు సంపాదించుకోలేకుండా, కాలు, చెయ్యి ఆడలేకుండా పోయిన తరువాత కాస్త తింటానికని సేవింగ్ చేస్తామో (కూడబెడతామో), అదే రీతిన, ఈ బాధ్యతలన్నీ నెరవేరగానే పరిపూర్ణంగా భగవంతుని ధ్యానం చేసుకొనే (శరణు పొందడం) బుద్ధి రావడం కోసం కావలసినంత జాగ్రత్త మాత్రం పడుతుండాలి. ఈ లోపల అవి మాత్రం తప్పక నిర్వర్తించి తీరాలి అని ఉంది. ఇలా కాకుండా ప్రయత్నం చేసేటటువంటి వాడు పాడైపోతాడు అని చెప్పి ఉంది. ఎందుకని అట్లా చెప్పాడంటే, ధర్మము, అర్థము, కామము, మోక్షము ఈ క్రమంలో వరసగా పొందాల్సింది. ధర్మం నాకక్కర్లేదు, నాకు మోక్షం కావాలి

అనే వాడికి అది రాదు. పునాదిలేకుండా నాకు మేడ కట్టమని అర్ధం. అడుగు మేడంతా కట్టకుండా నాకు పైన 15వ అంతస్తు కట్టమన్నాడని అర్ధం. అట్లూ వీలే కాదు. ఎవడైతే ధర్మాన్ని ఆచరించగలడో, ధర్మ బద్ధమైన అర్థాన్ని మాత్రమే ఎవడైతే సంపాదించగలడో, దాన్ని ధర్మబద్ధంగా మాత్రమే తన అవసరాలను తీర్చుకుంటూ ఉండగలడో, ఆ తన అవసరాలను తీర్చుకొనడంతో పాటూ, తన భాద్యతలను నిర్వర్తించగలడో, దానితో పాటు ఇంకా కాస్త దాన ధర్మం, ప్రక్కవాడి శ్రేయస్సుకై ఎవడైతే ఆలోచించగలడో, వాడు ఆధ్యాత్మికత గురించి ఆలోచించింది, ఏమన్నా పనికి వస్తుంది. లేనిదంతా ఊరికే అటు తిరిగి, ఇటు తిరిగి వీణ్ణి ఎక్కడున్నాడో అక్కడికి దింపుతుంది. వైకుంఠపాళీ ఆటలాగ. తెలుగులో "పరమపద సోపాన పటం" అని రాస్తారు. వైకుంఠపాళి అని వ్యవహారం చేస్తాము. ఆ ఆటలో ఏం చేస్తాం, నిచ్చెనలుంటాయి. పాములుంటాయి. గవ్వలు వేస్తాము, నిచ్చెనలు ఎక్కుతుంది. పోతుంది, పోతుంటుంది. మళ్ళాపోయి పెద్ద పాము నోట్లోపడి బర్రున తిరిగి మళ్ళీ క్రిందికి వచ్చేస్తుంటుంది. మన పరిస్థితి అంతే అన్నమాట! ఈ ధర్మాన్నెవడైతే ఉల్లంఘించి తపస్సు, ధ్యానాలంటాడో, ఏమీ వాడికి ఒరగదు. పెద్దపాము నోట్లో పడి, వాడు వెనక్కి తిరిగివచ్చి, మళ్ళీ మానవ జన్మ రావడం కూడా చాలా కష్టమై, మళ్ళీ ఇక్కడ నుండి పైకి వెళ్ళాలి. ధర్మం సక్రమంగా ఆచరించిన వాడికి మాత్రమే దుఃఖం ఎక్కువగా లేకుండా, మితంగా మాత్రమే సుఖ, దుఃఖాలుండేటటువంటి మానవ జన్మ వస్తుంది. అదొచ్చాక వాడు ఏ ప్రయత్నమైనా చేయగలడు.

ఎవడు ఏ ధర్మాన్ని ఏ భాగంలో ఉల్లంఘిస్తాడో, ఆ భాగంలో వాడికి వచ్చే జన్మలో పాడైపోతుంది. కర్మ దేనిని బట్టి పని చేస్తుంది అంటే, దీన్ని బట్టి పని చేస్తుంది. ఎవడు జీవితంలో ధర్మాన్ని, ఏ విషయంలో ఇప్పుడు తప్పుతున్నాడో, వచ్చే జన్మలో ఆ భాగం జీవితంలో నాశనమయిపోతుంది. పెద్ద కోటీశ్వరుడయినా సరే, ఆ కోటీశ్వరుడికి 5 పైసలు ఏమీ లెక్కలోనిది కాకపోవచ్చు. కానీ చీట్లపేకలో ఒక పట్టు 5పైసల చొప్పున వాడు జూదమాడాడనుకోండి, మరుజన్మలో భుక్తికుండదు. వాడు వ్యాపారం మీద చెయ్యిబెడితే నిలువునా భస్మమైపోతుంది. వాడు పొలాలు కొంటే అప్పుడే

తెగుళ్ళు వస్తాయి, ఎక్కడా లేని తెగుళ్ళు వస్తాయి, ఎప్పుడూ రాని వరదలూ వస్తాయి. ఎప్పుడూ లేని కాటకాలు వస్తాయి, పాడైపోతుంది. వాడు అమ్మేక, అవతలివాడు బాగు పడతాడు. వీడు వదిలేశాక అప్పుడు బాగుపడతాయి. వీడేమైనా సరుకు కొంటే దానికి అప్పుడే రేట్లు పడిపోతాయి. వీడిక నావల్ల కాదు అని సరుకు అమ్మిన తరువాత రేట్లు బాగుపడతాయి. ఎందుకని? అంటే, డబ్బు దుర్వినియోగం చేశాడు గనుక, డబ్బు వచ్చి పాడైపోతుంది అయితే వాడికి కోట్లుండి, అయిదు పైసలే పెట్టాడు గదా? అంటే కుదరదు. ముఖం మీద ఉమ్మేస్తాను. నీ ముక్కు మీదే గదా ఉమ్మేసాను, నన్ను తిట్టబాకు అంటే కుదరదు. ఎవడి మొఖం మీదైనా తుపుక్కున ఉమ్మేశాము. అదిపోయి ముక్కు మీద పడింది, నీ ముక్కు మీద ఇంత భాగంలోనే కదయ్యా పడింది. నేను నిన్నేం చేశాను. ఏమైనా కొట్టానా, తన్నానా, చంపానా, కొరికానా, కళ్ళలో కారం పోశానా? ఏమీ చేయలేదు గదా? ముక్కు మీద అంతమేరకు పడింది, అంతేనా? అంటే ఊరుకుంటాడా? అందుకని ఆ ధర్మం అట్లాంటిదన్నమాట. దెబ్బ అలా తగులుతుంది. ఆలాగే బాధ్యతలు ఎగేసిన వాళ్ళు. బాధ్యతలు ఎగేసిన వాడికి ఏమవుతుందంటే, ఎవరిపట్ల ఇప్పుడు వాడు బాధ్యతలు ఎగేస్తున్నాడో, అంటే వాటాలో విడిపించుకొని, తినేసి, మోసం చేసేసి మొత్తం కొట్టేశాడనుకోండి, మరుజన్మలో వాణ్ణి మంచినీళ్ళు తాగిస్తారు, సోదరులై. సుఖంగా బ్రతక నివ్వరు ఒక పట్టాన. మొక్కజొన్న కండిని కాల్చినట్లు కాలుస్తారు. ఇటు తిరిగితే అటు, అటు తిరిగితే ఇటు వాయించి పడేస్తారు. భార్యను భర్త, భర్తను భార్య వేధించారనుకోండి. కొన్ని జన్మలపాటు అసలు సాంసారిక జీవితంలో సుఖం అనేది కుదరదు. ఒకటి సర్దుకునే లోపల ఇంకొక దెబ్బ తగులుతుంది. ఈ జన్మలో ఇది సర్దుకునే లోపల మరుజన్మలో ఇంకొకటి తగులుతుంటుంది. ఎందుకట్లా జరుగుతుంది? ఇలా జరగడం సమంజసమేనా? అనిపిస్తుంది మనకు. ఎందుకంటే ఇంత ఉండాలనిపించదు. మరీ అంత తంతే ఎట్లా చెప్పు అనిపిస్తుందన్న మాట. అంటే అంత తన్నరులే అంటే, కాస్త చెయ్యచ్చు, ఓర్చుకోవచ్చునన్నమాట మన ఉద్దేశ్యం అని అనిపిస్తుందే తప్ప చెయ్యకుండా ఎట్లా ఉందామా అనిపించదు. అందుకని ఓయబ్బా! ఇంతటి కష్టం ఎందుకొచ్చింది అంటే దానికి కారణం ఉంది.

మన శరీరంలో ఉండే ప్రతి జీవ కణం దగ్గర నుండి ప్రతి ధాతువు దగ్గర నుండి మన అబ్బ సొత్తు కాదు. భగవంతుడు మనకిచ్చినది. బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తుండటప్పుడు ఒక్క 10 రూపాయలు తగ్గితే ఒప్పుకుంటారా? సాయంత్రం వచ్చేటప్పుడు లెక్క అప్ప చెప్పటానికి, బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తుంటే, బ్యాంక్ పని అయిపోయాక ఇంటికి బయలుదేరి వచ్చేటప్పుడు ఈ రోజు క్యాష్ ఇంత ఉందండి అని అప్పచెప్పేటప్పుడు 10 రూపాయలు తగ్గితే ఒప్పుకోరు. అది 10 రూపాయలా, 5 రూపాయలా, 100 రూపాయలా అనేది ప్రశ్నకాదు. ప్రభుత్వం, ప్రజలూ వాణ్ణి నమ్మి వాడి చేతిలో పెట్టినందుకు వాడంత అలక్ష్యంగా ఉంటాడా? ఇది అన్నిటి కంటే, దీనిలో శరీరంలో ఉండేటటు వంటిది కానీ, మన మనస్సులో ఉండేటటువంటిది కానీ, దానితో సమానమైనటు వంటిది. ఈ సృష్టిలో, ఈ ప్రకృతిలో ఏదీ మనం చేయ గలిగిందేమీ లేదు. ఆస్తి పాస్తులు యావత్తూ కోట్లు, కోట్లు మనకున్నదనుకోండి. ఈ కోట్లు ఆస్థింతా కలసి మన శరీరంలో ఒక్క జీవధాతువును తయారు చేయలేవు. ఒక రక్తకణాన్ని తయారు చేయలేవు. కొన్ని కోట్లు, మిలియన్లు మిలియన్లు డాలర్లు పెట్టి, సైంటిష్టులంతా కలసి పెద్ద పెద్ద ల్యాబరేటరీలు పెడితే ఒక్క రక్త కణాన్ని సృష్టించలేదు ఇప్పటి వరకూ! ఒక జీవకణాన్ని సృష్టించలేదు ఇంతవరకూ. ఇది అంత తేలిగ్గా ఉందా? అందుకని ఇంత విలువైంది, ఇంత పవిత్రమైనది నీ చేతికి అప్పచెప్పినప్పుడు, దీని పట్ల నువ్వు ఈ విధంగా ప్రవర్తించావు గనక, దాని వల్ల అన్నమాట ఆత్మహత్య అంత మహాపాపమని చెప్పింది. ఆత్మహత్య పాపం అసలు ఎందుకు కావాలని? ఎవడో వాడు ఆత్మహత్య చేసుకున్నాడు. వాడు ఎవడినన్నా చంపాడా? ఎవడి ఆస్తన్నా కాజేశాడా? ఎవరి గురించైనా చెడ్డగా మాట్లాడాడా? ఇవేవీ చెయ్యకపోయినా వాడి ప్రాణాలేగా వాడు తీసుకున్నాడు. మరి అన్నింటికంటే ఘోరమైన పాపంగా ఎందుకు చెప్పారు? అంటే ఏం చెప్పారంటే, నీ శరీరం మీద నీకు హక్కేం లేదు, నీ తాత సొత్తూ కాదు, నీ యబ్బ సొత్తు (అంతకుముందే) కాదు అన్నారు. వచ్చింది సింపుల్‌గా. అందుకని చచ్చినట్లు బాధ్యతగా నిర్వర్తించుకోవల్సిందే అన్నారు. దానియొక్క విలువను బట్టి, నీకు అప్ప చెప్పబడ్డ వస్తువు ఇంత విలువైనది, దాన్ని అంత విలువైనదిగా నువ్వు

వాడుకోవలసే ఉంది. ఇంకొక రకంగా దానిని ఏ విధమైనటు వంటి మార్పూ చేయటానికి రాయతీ లేదు. అందువల్ల ఆత్మహత్య మహాపాపం.

మన శరీరంలో ఉండేటటువంటి ఒక్కొక్క శక్తి సామర్థ్యాలు, ఒక్కొక్క దేవతలకి సంబంధించినటువంటిది. మన కళ్ళు చూస్తున్నాయి. మన చెవులు వింటున్నాయి. ఇవన్నీ కూడా ఒక్కొక్క దేవతా సామర్థ్యం మన చెవులలో పని చేస్తుండటం మూలాన అని వినగలుగుతాయి. ఒక్కొక్క దేవతా సామర్థ్యం మన కళ్ళల్లో పని చేస్తుండటం మూలాన మన కళ్ళు చూడగలుగుతాయి. ఇలా ముక్కోటి దేవతలు ఉంటారన్నమాట. మన శరీరంలోనూ అన్నిటిలోనూ ఈ దేవతలు ఎక్కడ ఉంటారంటే? ఒక పెద్ద గంగాళంలో సాంబారు కాచిన తరువాత ఎక్కడ గరిటెడు సాంబారు తీసినా సరే అందులో పప్పు ఉంటుంది. అందులో చింతపండు ఉంటుంది, అందులో ఉప్పు ఉంటుంది, అందులో పసుపు ఉంటుంది. తిరగ మాత ఉంటుంది, అందులో కారముంటుంది. ఎక్కడన్నా తియ్. అలాగే సృష్టిలో ఏ ప్రాణినన్నా తీసుకున్నాసరే ఆ ప్రాణియొక్క శరీర భాగాలలో ముక్కోటి దేవతలూ ఉంటారు. అట్లాగే ఇందులోనూ (మన శరీరంలో) ఉంటారు. ఆ ముక్కోటి దేవతలూ కలిసి పనిచేస్తుండడం వలన ఈ శరీరం నిలచి ఉంటుంది. ఒకప్పుడు నేను కూడా చాలా పెద్ద నాస్థికుడను. చాలా తెలివైనవాణ్ణి అనుకుంటుండే వాణ్ణి ఆ రోజుల్లో. అట్లా అనుకోవడమే కాదంటానికి బుజువు. మొట్టమొదటి బుజువు. ఆ రోజుల్లో అదేమిటి, ఇదేమిటి అని అడిగేవాణ్ణి. కానీ ఇప్పుడు కాస్త, కాస్త తెలుస్తోంది. అట్లా కాదని, ఇవన్నీ, ఇంత బాధ్యత గల విషయం మనకు అప్పచెప్పబడ్డది కనుక, దేనిపట్ల ఏ విధమైన చెడుగా ప్రవర్తించరాదు. ఆత్మహత్య చేసుకోటానికి పయత్నించినపుడు ఇంతమంది దేవతలనూ హతమార్చినట్లవుతుంది. ఇంతమంది దేవతలనూ హింసపెట్టినట్లవుతుంది. ఎవర్ని హింసపెట్టినా గానీ వాడిలో ఉన్న ఇంతమంది దేవతలనూ హింసపెట్టినట్లవుతుంది. అందుకని ఆ గుణం మనిషిలో నుండి తొలగనిదే వాడికి భగవంతుడు కనిపించడమనేది లేదు. వాణ్ణి కావాలంటే ఒంటి కాలు మీద నుంచోమనండి. వీడు ఒంటి కాలు మీద నుంచుంటే ఆయనకేమి? ఓపికుండి నుంచున్నాడు. నుంచోనిమ్మంటాడు. లేదంటే అడగండి నేను మీ ఆఫీసు ముందు ఒంటికాలు మీద నుంచుంటానిట్లా, నాకు ఉద్యోగం ఇస్తావా

లేదా? అంటే, కాసేపయిన తరువాత కాలు విరిగిపోయి నువ్వు క్రింద పడిపోతావు ఇయ్యను అంటారు. నీకు క్వాలిఫికేషన్ ఉంటే రా, క్వాలిఫికేషన్ లేకుండా ఒంటికాలు మీద నుంచుంటే నేనెట్లా ఇస్తా? నీకంటే కొంగ బాగా నుంచుంటుంది. దానికిచ్చేదా? ఆలాయేం కుదరదు. నీకు క్వాలిఫికేషన్ ఉంటే ఇస్తాము. పని చేయడం చేతైతే ఇస్తాం. పనిచేయడం చేతకాక, క్వాలిఫికేషన్ లేక నువ్వు ఒంటికాలుపై నుంచుంటే ఎట్లా ఇస్తాం? వెధవ ఉద్యోగమే గదా! సాటి మనిషి సాటి మనిషికి ఇయ్యడే. బ్రహ్మ సాక్షాత్కారం ఇస్తాడా? వీడికేమి పనిలే! నువ్వు అర్హత పొందు. నువ్వు హాయిగా బాసిపెట్లు వేసుకొని కూర్చో నీకిస్తాం హాయిగా పడుకో నీకిస్తాం. నీకు శక్తి, సామర్థ్యాలు ఉన్నాయి. నువ్వు చెయ్యవలసినవన్నీ చేశావు. ఆలోచించ వలసినవన్నీ ఆలోచించావు. ఆచరించవలసిన ధర్మమంతా ఆచరించావు. నువ్వు పడుకుంటే మాకేం, నువ్వు కూర్చొంటే మాకేం, నువ్వు స్నానం చేస్తే ఏం, చెయ్యకపోతే మాకేం? ఇది కూడా అంతే, అర్థమయిందా? ఏది ఆధ్యాత్మికతకు ముఖ్యమో, అవి అప్రధానంగా తలచబడుతున్నాయి. ఏవి అ|ప్రధానమో అవి ప్రధానంగా తలచబడుతున్నాయి. ఇప్పుడు ఆధ్యాత్మికతలో జరిగేదంతా పెద్ద పొరపాటు. మనలో ముక్కోటి దేవతలూ కలసి పనిచేస్తున్నారన్నమాట. దానివల్ల జరుగుతున్నాయి ఇందులో ప్రతి ఒక్కటి. లేకపోతే మన గుండె ఆగిపోయే రోజు ఉందే, మనందరం కలసి ఓట్లు వేసుకొని వాడి గుండె ఇంకొక నిమిషం సేపు నడవాలంటే నడవదు. అందరం కలసి ఓట్లు వేసుకొని వాడిప్పుడు చావాలి అంటే చావడు. అంతదాకా ఎందుకు, మనకే విసుగుపుట్టి ఇంతకంటే చచ్చినా మేలే అనుకుంటే చావము. ఇంకా పదిమందిని చంపొద్దూ, అప్పుడే పోతే ఎట్లా! సరే బ్రతికుండంగనే పదిమందిని, ఇంతకన్నా చచ్చినా మేలే ఆనిపించద్దా? అప్పటికి గదా మన జన్మ సార్థకం. అందుకని విరక్తి కలిగి వాడు చస్తే బాగుండును అంటే చావడు. చచ్చేరోజున బ్రతుకుతాను మొర్రో అంటే బ్రతకడు. అంతా మన చేతుల్లోనే ఉంది, అంతా మనం చేస్తాం అనుకుండే రోజుల్లో, నేను వేసే ప్రశ్నలకి ఎవరి దగ్గరా సమాధానాలుండేవి కావు. కానీ నేను ఆస్థికుడనైన తరువాత, భగవంతుడు ఉన్నాడు అని నమ్మాక నా దగ్గర బ్రహ్మాండమైన ప్రశ్న తయారవుతుంది. అంతా నీచేతుల్లోనే ఉందంటున్నావు

కదా? ఒక్క నిమిషం, ఒక చిన్న పరీక్ష పెడతాను. ఉందో లేదో తేల్చుకో. ఏమిటది?

గడియారం చూడు, సెకండ్ల ముల్లు ఉండే గడియారం తీసుకో, ఆ గడియారం చూస్తూ ఇంకొక ఆలోచన లేకుండ ఆ క్షణాలు చూపించే ముల్లు మాత్రమే చూడు. ఎంతసేపు చూడ గలుగుతావో చూడు. చూడలేడు. అది వీలవదు. ఇంక బ్రహ్మానెక్కడ చూస్తాడు. భగవంతుణ్ణక్కడ చూస్తాడు? ఈ వాచీకేసి చూస్తుంటే మన డైలు ఇట్లా ఉంది కానీ, వాడి డైలు గుండ్రంగా ఉంది అంటుంది, మనస్సు ఆలోచన. వాచీకేసి చూస్తే ఇది గుండ్రంగా ఉంది, ఇదివరకటిది నాలుగు పలకలుగా ఉంది అంటుంది. ఎహె! ఊరుకో, నిన్ను అది ఎవరు మాట్లాడమన్నారు. ఊరికే చూడు అన్నాడనుకోండి. ఇందులో ముల్లు ఇట్లా ఉంది. అందులో ముల్లు అట్లా ఉంది. చచ్చినా మనం చెప్పిన మాట వినదంతే. మనం చెప్పినకొద్దీ అది గొడవ చేస్తుంది. అది ఎంత అల్లరి పిల్లాడిలాంటిదంటే తుంటరి పిల్లాడు ఏమి చేశాడు? టీచరుగారు లోపలికి రాగానే, సైలెన్స్, సైలెన్స్ అని గోడలు ఎగిరిపోయేటట్లు అరుస్తున్నాడు. వాడేమో సైలెన్స్ అని అందరితో చెబుతున్నట్లు నటిస్తున్నాడు. వాడు మాత్రం విపరీతంగా అరుస్తున్నాడు. ఆ అరవడానికి ఇదొక సాకన్న మాట. ఇంతే మనంకూడా! ఇంత మాత్రం ఎదురుగా వుండే గడియారంకేసి చూసే ఆ రెండు క్షణాలపాటు మనస్సును నువ్వు చెప్పినట్లు చేయలేకుండా ఉన్నావే, నిన్నేమో మేడమీంచి దూకమన్లా, 48 రోజులు ఉపవాశం చేయమన్లా, సముద్రం అడుక్కి వెళ్ళమని చెప్పలా, హిమాలయా పర్వతాల పైకెక్కమని చెప్పలా, రెండు రోజులపాటు మంచినీళ్ళు తాగకుండా ఉండమని చెప్పలా. 100 రూపాయలు ఖర్చు పెట్టమని నిన్నడగలా. ఇది పరీక్ష పెడితే, మహామనోబలం గలిగిన చాలా గట్టివాళ్ళనుకున్నావే, వాళ్ళు రెండు నిమిషాలు చూడగలిగారు, ఎన్నోరోజుల అభ్యాసం చేత. వాడే రెండోసారి ప్రయత్నం చేస్తే రెండు నిమిషాలు కూడా పూర్తిగా చూడలేకపోయాడు. ఒకటిన్నర నిమిషం దాటి చూడలేక పోయాడు. మూడవసారి ప్రయత్నం చేస్తే, నిమిషం కూడా చూడలేక పోయాడు. అంటే ఏమిటన్న మాట, ఈ చూడగల సామర్థ్యం కూడా నీదిగాదంటోందన్న మాట. కష్టపడి రెండు నిమిషాలు చూసి, అమ్మా! రెండు నిమిషాలు చూడగలిగాను

అన్నావు గదా? చూడు ఈ సారి తెలుస్తుంది. నీ సంగతి అంటుంది. ఈ సారి నిమిషంన్నరే చూడగలిగావు. ఈసారో నిమిషమే. ఇందాకా చూసింది నువ్వే అయితే మరి ఇప్పుడిట్లా ఎందుకు చూశావ్? కాబట్టి అది నీ అడ్రస్ కాదన్నమాట. నీ కేరాఫ్ కాదు. మనస్సులో ఆ దేవతా శక్తులున్నాయి. శరీరంలో ఆ దేవతా శక్తులున్నాయి. ఇన్ని కలసి సమిష్టిగా, చక్కగా పనిచేస్తుండడం చేతనే బయట విశ్వం అయినా పని చేస్తుంది, మన శరీరంలో ప్రాణశక్తులూ పని చేస్తాయి, మనస్సులో సామర్థ్యాలూ పని చేస్తాయి. వాటన్నింటితో ప్రశాంతంగా, హాయిగా, సంతోషంగా ఉండడం ఎవడైతే నేర్చుకుంటాడో, వాడికి మాత్రమే పరమార్థం చేతనవుతుంది. వీటన్నింటినీ ఒక తాటిమీద నడిపించాలన్న మాట. ఇందులో తమాషా ఏమంటే మనలో ఎన్ని శక్తులున్నాయో, ఇవే శక్తులు ప్రక్కవాడిలో కూడా ఉంటాయి. అందుకని మనం చేసే పని వాడికి ఇబ్బందిగా ఉండగానే వాడు గొడవ చేయడం మొదలుపెడతాడు. అసలు మీరు పెట్టుకున్న లక్ష్యం గురించి వాడు ఆలోచించనియ్యడు. మీరు ధ్యానానికి కూర్చోవాలి, మీ అదృష్టం బాగుండి, మీ ఇంట్లోనూ, మీ ప్రక్కవారింట్లోనూ అందరూ ఊరికి వెళ్ళారు. వాళ్ళింట్లో ఒక్కడే మిగిలాడు. మీ ఇంట్లో ఒక్కడే మిగిలారు. అమ్మ! ఇంతకాలానికి నాకు ధ్యానం చేసుకొనేందుకు, పరమార్థం చేసుకొనేందుకు time వచ్చిందబ్బా! ఇక చేస్తా పట్టు అనుకున్నాడు. ఆ! అంత తేలికయింది ఏమీ లేదు. వీడు తలుపేసుకొని కూర్చొన్నాక, టక్ టక్ టక్ అని ప్రక్క వాడు తలుపుకొడతాడు. ఏమిటండి అంటే, తాళం చెవులు ఇచ్చి వెళ్ళారా? అంటాడు. ఇచ్చెళ్ళారయ్యా బాబూ. ఆ తాళం చెవులు తీసుకెళతాడు. అయిన తరువాత మళ్ళా కూర్చొని మళ్ళా ధ్యానం చేసుకునే సమయానికి మళ్ళా టక్ టక్ అని కొడతాడు. ఎప్పుడొస్తామన్నారు. మావాళ్ళు, ఏమైనా చెప్పమన్నారా? నాతో. ఇంకాసేపయ్యాక మళ్ళా కొడతాడు. ఏమండోయ్ మీ ఇంట్లో మంచినీళ్ళు కానీ, మజ్జిగకానీ ఏమైనా లేకపోతే అడగండి. అనవసరంగా దండగ ఎందుకు తీసుకొండి. ఇంతే! ఇక చచ్చినా, మజ్జిగ గురించి, పెరుగు గురించి, పెరుగు వడల గురించి ఆలోచిస్తూంటుంది బుర్ర. వీణ్ణిమాత్రం కూర్చోనియ్యదు. వీణ్ణిట్లాగే ఆడిస్తుంటుంది. అందుకని వాడు గూడా అట్లా కూర్చునేవాడు, అట్లాటి అభ్యాసం కలిగిన వాడూ అయితేనే వీడికి కూడా రక్తి కడుతుంది. అందుకని మనిషికి రెండు ధర్మాలున్నాయి. తాను నేర్చుకుంటూ ఒక్కొక్క అడుగు

ముందుకేసుకుంటూ, సాధ్యమైనంత వరకూ ప్రక్కవాడికి అది చెప్పి వాడు కూడా ఒక్కొక్క అడుగు వేసుకుంటూ ఉండేలా చెప్పుకుంటూ పోవాలి. ఇంతకంటే మార్గం లేదు.

మనం నాలుగు లెక్కలిచ్చి, పదిమందికి ట్యూషన్లు పెట్టి, నెడుతూ ఉంటే లెక్కలు బోరుకొడుతుంటాయ్. ఎవడో గొప్ప గణిత శాస్త్రజ్ఞుడు ఉంటాడు. ఆంతర్జాతీయమైన ప్రతిభ కలవాడు. శ్రీనివాస రామానుజన్ లాంటివాడు. నువ్వు చచ్చిపోతావురా ముండాకొడకా, నీకు జబ్బురా, నీకు రోగం అన్నా సరే, చచ్చినా చస్తాను కానీ ఊరుకోను అని చెప్పి ఈక్వేషన్లు వేస్తూనే వుంటాడు వాడు. మరి నీకు అంత బోరెందుకు కొడుతుంది? లెక్క చెయ్యనియ్యకపోతే అంతకంటే బోరుకొడుతుంది వాడికి. కాబట్టి లెక్కలే కనుక బోరైతే మరి వాడికట్లా, నాకిట్లా ఎందుకుంది? నా దగ్గరే ఉంది దోషం. మనందరికీ ఆరోగ్యంగా ఉండేవాళ్ళకి తియ్యగా ఉండే వస్తువు, వాడికి చేదుగా ఉందంటే అర్థం ఏమిటి? వాడికి రోగం వచ్చిందని అర్థం. అట్లాగే 'తెలుసుకొనడం అనేది ఎలా తెలుసుకోవాలో అనేది తెలిస్తే గనుక మనిషికి, తెలుసుకున్న కొద్దీ ఆనందమేకానీ, తెలుసుకున్నకొద్దీ సంతోషమే కానీ ఇక చాలు అనేది ఎక్కడా ఉండదు. ఇక చాలు అంటే అజీర్తి పుట్టింది అని అర్థం. ఇది తెలుసుకుని ఏం చేయాలి? అంటే అసలు ఏదో ఒకటి చేయాలని అనుకున్నాడంటే ముందు అంతకంటే భ్రమలో పడ్డాడు. ఏం చేయాలి జీవితంలో? ఏమీ లేదు బ్రతకడం నేర్చుకుంటే చాలు. ఆధ్యాత్మిక జీవితం అంతా ఏమిటీ? బ్రతకడమెట్లాగో నేర్చుకోవడం. అంటే బ్రతికేది దేనికోసం అంటే సుఖాన్ని, శాంతినీ ఆశించాము గనుక, శరీరం ఉన్నంతకాలం సుఖశాంతులతో ఉంటుంది. రాలిపోయిననాడు, సుఖ శాంతులతో రాలిపోతుంది. ఆ తరువాత మళ్ళీ జన్మ కొచ్చేందుకు బుణానుబంధాలు కానీ, రాగద్వేషాలు కానీ, మనసులో కాపీనాలు కానీ, ఏమీ లేవు. జాగ్రత్తగా వినండి. ఆధ్యాత్మికతని మనం మామూలుగా మాట్లాడుకునే భాషలో చెబితే ఇదే. ఇదే సంస్కృత పదజాలంతో చెబితే అబ్బా! బ్రహ్మాండంగా వేదాంతోపన్యాసం చెప్పాడు భరద్వాజ గారు అనుకుంటారు. నేను సంస్కృత పదాలు వాడలేదు కాబట్టి, ఇట్లాంటి దౌర్భాగ్యపు కబుర్లన్నీ చెప్పిపోతుంటాడు సత్సంగంలో అని అనిపిస్తుంది. సంస్కృత పదాలనే వాడటంలేదు తప్పు, నే

చెప్పే ప్రతి ఒక్కమాటకీ వేదంలో వాక్కున్నది. నే చెప్పే ప్రతి ఒక్కటికీ సంస్కృతంలో వాక్కున్నది. ధర్మ శాస్త్రంలో వాక్కున్నది, భగవద్గీతలో వాక్కున్నది.

"యోగః కర్మసుకౌశలం" కుశలత, ఏ పని చేసినా కానీ ఆ పని చేయటంలో ఉండే కుశలతే యోగం.

"సమత్వం యోగముచ్యతే" శీతోష్ణాలయందు సుఖ, దుఃఖాల యందూ ఎవడు సమానంగా ఉండగలడో, అది యోగం అంటారు. ఆ సమానత్వాన్ని ఎంత సునాయాసంగా చెప్పుకుంటూ పోతున్నాడో చూడండి. కానీ ఇవన్నీ కుదరాలంటే, ఇప్పటిదాకా నే చెప్పినది. ధర్మశాస్త్రంలో ఉంటుంది ఆ శ్లోకం. "మన ఋణానుబంధాలు, మన బాధ్యతలు, మనమిచ్చిన వాగ్దానాలు, ఇవన్నీ నువ్వు కూలంకషంగా నెరవేర్చాలి. ఆ నెరవేర్చేటప్పుడు లోపల ప్రేమ ఉండాలి. ప్రేమకు మమకారానికీ తేడా ఉంది. మమకారం ఏం చేస్తుందంటే ఎవడిమీద మమకారం ఉందో వాళ్ళకోసం అధర్మం చేయడానికి ఒప్పుకుంటుంది. ద్రోణుడూ, భీష్ముడూ వీళ్ళంతా ఉన్నారు. ద్రోణాచార్యుడికి ధర్మం తెలుసు, భీష్ముడికీ తెలుసు. కౌరవులతో ఎందుకు పోయారు. అది మంచిగా పోయారా, చెడ్డగా పోయారా, అది తరువాత సంగతి. కౌరవులతోపాటు వాళ్ళూపోయారు. ఊరగాయలు పెడుతున్నారు. ఆ ఊర గాయలకు కొట్టిన మామిడికాయలతో పాటు వాళ్లనూ కొట్టిపారేశారు. ఎందుకని? వీటి దగ్గరకొచ్చేటప్పటికి తనకి ఎక్కువ తెలుసునన్న పరిస్థితికి వస్తారు. తనకు తెలిసినదాన్ని వదులుకోలేకపోతారు. అంతకంటే పెద్దది చెప్పినా ఒప్పు కోలేకపోతారు. కృష్ణుడున్నాడే కృష్ణుడు ఎటు ప్రక్క ఉంటే అదే ధర్మం అనే జ్ఞానం ఉండొద్దూ. కృష్ణుడు సాక్షాత్తూ పరమాత్మ స్వరూపం అని తెలిసిన కొద్దిమందిలో భీష్ముడు ఒకడు. కాబట్టే కృష్ణుడి స్మృతి చేసుకొని, కృష్ణసాక్షాత్కారం పొందిన తరువాతగానీ శరీరం వదలలా! అంత తెలిసిన వాడు. కృష్ణుడు ఎటుప్రక్కనున్నాడో అటుప్రక్క ధర్మం ఉండదూ? అసలు మళ్ళీ ఆలోచించచ్చూ? నేను కౌరవుల ప్రక్క ఉండొచ్చా ఉండకూడదా అని. ఆహా! నేను వాళ్ల ఉప్పు తిన్నాను కాబట్టి కౌరవుల ప్రక్క ఉండవలసిందే అని. ఆ! అయితే వాళ్ళ ఉప్పే తిను అన్నాడు. చాలా ధర్మాత్ముడు ఒకాయన ఉన్నాడు. ఆయన ధర్మాత్ముడే,

మీకూ తెలుసు, నాకూ తెలుసు ఆ సంగతి. కానీ బందిపోటు దొంగలొచ్చి వాళ్ళింట్లో దాక్కునుంటే చెప్పట్లా. వాళ్ళేమో మన తలకాయలు పగలకొట్టి మనింట్లో డబ్బులు తీసుకుపోతున్నారు. మనం ఏం చేస్తాం ఆయనికి రెండు సార్లు చెబుతాం, మూడుసార్లు చెబుతాం. నాలుగవసారి ఆయన తలకాయ మనం పగలుకొడతాం. ఎందుకంటే ఆయన బాగుంటం మూలాన మనం అంతా చెడుతున్నాం. పుట్టలో పాముంటే ఏం చేస్తున్నాం అంటే, పుట్టను పగలగొడుతున్నాం. పాము దొరక్కపోతే పుట్టేం చేసింది నిన్ను? అట్లా ఏం కాదే! లోపల పాము దొరక్కుండా చేస్తోంది కాబట్టి ముందు పుట్టనుకొడితే కాని పాము దొరకదు. బాదం పప్పుకేం చేస్తున్నాం. లోపలి పప్పు తింటున్నావు, అదే మర్యాదగా బయటకు రమ్మను, పగలగొట్టకుండా పప్పును తీసుకుంటాం. ఎందుకు పగలగొడతాం. ఎవరు పడతాడా శ్రమ. అట్లా ఏం కుదరదు. అది పామంటూ అయ్యాకా, కరిస్తే చంపేటటువంటి గుణం దానికున్నాకా, అదిపోయి గనుక దాక్కుంటే, ఆ పుట్ట గనుక దానికి రక్షణ ఇస్తే ఆ పాముతోపాటు ఆ పుట్టకూడా పోవలసిందే. అందుకనే కౌరవుల సేనలో ఎప్పుడైతే చేరారో, కౌరవులతో పాటు వాళ్ళు కూడా పోవలసిందే. ఆయనకు ధర్మాలన్నీ తెలియవా, ధర్మాలు తెలుసు. కృష్ణుడు పరమాత్మ అని తెలియదా? తెలుసు. మరి పొయ్యాడుగా? పోయ్యాడు. ఎందుకని? అన్నింటికంటే పెద్దది కృష్ణుడు పరమాత్మ అని తెలిసాకా, ఆయనేం చెబితే అదే ప్రమాణం అనుకోవడం చేతకాకపోవడం వల్ల. అంతకంటే ఉప్పు తిన్నాననే ధర్మం మనకు తెలిసిన ఈ ధర్మం ఎక్కువయినది అనుకోవడంవల్ల పోయాడు. ఇంతా వాళ్ళంతా కలిసి చేసింది ఏమిటీ? వాడు సుఖంగా ఉండక, ఇంకొకర్ని సుఖంగా ఉండ నివ్వనటువంటి దుర్యోధనుని ప్రక్కకు చేరారంతే. దుర్యోధనునికి, కౌరవులకీ ఉన్న గుణమేంటి, వాళ్ళు సుఖంగా చావలేదు. ఇంకొకళ్ళని సుఖంగా ఉండనియ్యలేరు. పాండవులు వాళ్ళజోలికి ఎప్పుడు వెళ్ళారు పాపం. వాళ్ళ మానానేదో వాళ్ళు బ్రతికారు. వాళ్లకేదో చేతయింది వాళ్ళు చేసుకున్నారు. వాళ్ళింట్లో పెళ్ళి చేసుకున్నారు. ఉత్సవం చేసుకున్నారు. ఓ పదివేలమందికి అన్నం పెట్టుకున్నారు. వీడికి కడుపుబ్బెందుకు? ఔరా! వాడు పదివేలమందికి పెడతాడా? నాకు రెండతస్తుల మేడ ఉంటే వాడు ఐదు అంతస్తుల మేడకట్టుకుంటాడా? ఇంతే వాళ్ళకొచ్చింది. అలాంటివాళ్ళ ప్రక్కన చేరారు.

అంటే ఏమిటన్నమాట, అందరితోనూ ధర్మంగా ఉంటూ అందరితోనూ ప్రేమగా ఉంటే, అప్పుడది ప్రేమ అవుతుంది. భీష్ముడిలాగా, వాళ్ళలాగా వీళ్ళలాగా, వాడికి ధర్మం తెలిసుండి కూడా, అధర్మం వైపు నిలబడ్డానికి వాడికి కారణమైతే, పోతే పోతాం, వాడులేకుండా మనమెలా బ్రతుకుతాం, వాణ్ణి మాత్రం నేను వదిలిపెట్టను. నా స్నేహితుడు వాడు. వాడిది తప్పే కావచ్చు, వాడికి నువ్వు శిక్ష వేసినప్పుడు, నాకు వాడిమీద ఎంత ప్రేమ ఉందంటే వాడితోపాటు నేను కూడా జైలుకి వెళతాను కానీ వాణ్ణి వదులుకోను. అంటే నువ్వు జైలుకెళ్ళు. ఇవతల మాత్రం నీకు స్థానం లేదు. కుదురదు. ఆ ఉదాహరణలోనూ, ఈ ధర్మ శాస్త్రంలో చెప్పిన శ్లోకంలోనూ, ఇప్పుడు నేను చెప్పిన ఆధ్యాత్మిక సూత్రంలోనూ, వీటన్నింటిలోనూ ఉన్నది ఏమిటంటే "మానవుడు అన్ని జీవులపట్ల తాను ఎట్లా వ్యవహరించుకోవాలో ఆ రకంగా వ్యవహరించుకోవాలి". ఎట్లా వ్యవహరించుకోవాలి? అంటే, ఇతరులు నీ పట్ల ఎట్లా వ్యవహరించు కోవాలనుకుంటావో అట్లా వ్యవహరించు కోవాలి. మనం బజారు కెళ్ళాం. మనకు ఇదివరకూ ఎప్పుడూ అనుభవం లేని వస్తువు కొనుక్కోవాలసి వచ్చింది. అట్లాంటి వస్తువు కొనలేదు. అట్లాంటి వస్తువు కొనుక్కోవలసి వచ్చి మనం బజారుకు వెళ్ళాల్సి వచ్చింది. ఆ రోజే కొనే తీరాలి. షాపులు మూసి వేస్తున్నారు. తెలిసినవాళ్ళని పిలుచుకొచ్చి కొనేందుకు సమయం లేదు. నీకు దీని సంగతేమీ తెలియదని వాడు అర్థం చేసేసుకున్నాడు, ఆ షాపువాడు. దీని ఖరీదు 10 రూపాయలు. నువ్వు 100 రూపాయలు ఇయ్యగానే 10 రూపాయల విలువచేసే వస్తువు ఇచ్చాడనుకోండి. ఏం చేస్తారు? మీరు 100 రూపాయలు ఇచ్చారు ఆ వస్తువు కోసమని. వాడు 90 రూపాయలు ఇచ్చి, 10 రూపాయలు తీసుకోనుండాలి. వాడేం చేశాడు, 10 రూపాయలే చేసే వస్తు విచ్చాడు అంటే 90 రూపాయలు కొట్టేశాడు. అయితే మీకు తెలిసిందా లేదా అనేది కాదు, నీకు తెలియకుండా నిజంగా 90 రూపాయలే అనుకోనుండొచ్చు. కానీ ద్రోహం, మోసం, ఎంత దగానో చూడండి. ఇదే జూదంలో జరిగింది, పాచికల ఆటలో! అక్కడ 10 రూపాయలన్నా ఉంది, ఇక్కడ అదిగూడాలేదు. కపటమైన పాచికలు వేసి రాజ్యం కొట్టేశారు. అందుకు చంపాల్సివచ్చింది వాళ్ళని. వాళ్ళు జూదం ఆడేటప్పుడు పాచికలు మాత్రం కపటంగా వేస్తారట, వీళ్ళు మాత్రం అజ్ఞాతవాసం, ధర్మం ప్రకారం ఇచ్చిన

మాట ప్రకారం నిలబడాలట. ఎందుకు చంపాల్సీవచ్చింది అంటే, ఇందువల్ల చంపాల్సివచ్చింది. వాడు జూదం ఆడేటప్పుడేమో కపటంగా వేయవచ్చు. కానీ ఆ తరువాత పెట్టిన ఫలితంలో వాళ్ళు ఓడిపోయి పాటించాల్సి వచ్చినప్పుడు ఆ ధర్మంలో తూచ| తప్పకుండా పాటించాలన్నమాట. అజ్ఞాతవాసం రేపటితో అయిపోతుందంటే ఇవాళకి తెలిస్తే మళ్ళా అన్నేళ్ళుండాలి. ఏం? అంత దారుణం అయిపోయిందన్నమాట అధర్మం. అందుకని మమకారం చేయిస్తుందా పని. జరిగినది ఇంత అన్యాయమైతే, దుర్యోధనుని ప్రక్కన నుంచోడంలో భీష్ముడుకి ఎంత ధర్మం తెలిసినట్లు? జరిగింది ఎంత అన్యాయమో ఒకసారి ఆలోచించండి. అది ఆలోచించాక భీష్ముడికి ధర్మం తెలుసనుకుంటారా? తెలియదనుకుంటారా? తాగితే రేపొద్దున్న చస్తామని తెలిసికూడా ఇవాళ త్రాగేవాడి లాంటివాళ్ళు వీళ్ళు. వాడికి తెలిసి కూడా లెక్కేలేదు. తెలిసినా ఏం ఉపయోగం లేదు. తెలియని వాడితోనే సమానం. అందుకని మమకారంతో సంబంధం లేకుండా, తనకి ఎవరైనా ఏంచేస్తే బాగుంటుందో అదే తానందరికీ చేయగలగాలి. ఇతరులు తనకేం చేయాలను కుంటాడో అది తానితరులకు చేయగలగాలి. ఇతరులు తనకేం చేయకూడదను కుంటాడో అది తానెప్పుడూ ఇతరులకు చేయకూడదు. ఈ రకంగా ఉండగలిగితే, మనకేం అనిపిస్తుంది. మనకేదైనా విషయం తెలియకపోతే ప్రక్కవాడు చెప్పాలనిపిస్తుంది. నేను 10 రూపాయలది, 100 రూపాయలనుకుని ఇస్తే ఆ వస్తువు ఇచ్చి నాకు 10 రూపాయలే ఇచ్చేటప్పుడు, ప్రక్కన ఎవరన్నా ఉండి, ఏమిటయ్యా అది అన్యాయము. 10 రూపాయల వస్తువుకు 90 రూపాయలు తీసుకుంటావేమిటి? దాని విలువ 10 రూ||లే కదా, అంటే, దీని విలువ ఇంతేనండి అని చెప్పాడనుకో, మనం నష్టపోకుండా వచ్చేవాళ్ళంకదా? కాబట్టి ప్రక్కవాడు చెప్పాలనుకుంటాం. ఇట్లాగే జీవితంలో ఏ అంశంలో, ఏ భాగంలో మనం దెబ్బతినకుండా ఎప్పటి సలహా, అప్పుడు ఇచ్చేవాళ్ళు మన ప్రక్కనుంటే ఎంత బాగుంటుంది?

మందు ఇస్తున్నాం, ఆ టాబ్లెట్‌కంటే, ఈ టాబ్లెట్ మంచిదండి. వస్తువు కొనుక్కుంటున్నాం, దీనికంటే ఆ వస్తువు మంచిదండీ. ఇలా ప్రతీదీ మనకేదైతే తెలియదో అదంతా తెలిసి చెప్పేవాడున్నాడనుకోండి, ఎంత సహాయం?

అందుకని ఆ సహాయం నువ్వు చెయ్యటానికి ప్రిపేర్ అవ్వాలి. ఇతరులందరూ కలసి నీకది చేస్తే మంచిదనుకున్నావు గనుక, నీవు అది చేతనైనంత మందికి ఇతరులకు అది చేస్తూనే ఉండాలి. ఇది చేస్తే నాకేమి వస్తుంది? అని అడిగితే, నువ్వు ఉంటే ఏమి వస్తుంది గనుక దేశానికి? నువ్వు సంతోషంగా ఉండడంవల్ల దేశానికి ఒరిగేదేమిటి? కాబట్టి పో అంటే ఏం లాభం. ధర్మం యొక్క సారాంశం అంతా ఏమిటంటే తనకితరులు ఏమి చేయాలనుకుంటూ ఉంటాడో అది తా నితరులకు చేయడం. ఇతరులు తనకి ఏది చేయకూడదను కుంటాడో అది తాను ఇతరులకు చేయకుండడం. ఈ రెండూ ఎప్పుడు సాధ్యమవుతాయంటే, మమకారం లేకుండా, ప్రేమ ఉన్నప్పుడు సాధ్యమవుతాయి. మమకారం ఉన్నచోట సాధ్యమవుతాయి, కానీ కొంతమంది దగ్గరే సాధ్యమవుతుంది. నేను ఒక కోర్సు చదివాను. ఆకోర్సులో నేను పైకి రాలేక పోయాను. అప్పుడు మాబిడ్డను తీసుకపోయి అందులో పెట్టనే. అందులో ఏదో ఉందనుకొని దిగి నా జీవితం పాడయింది. మావాడు మాత్రం దాని జోలికి వెళ్ళకూడదంటాను. ఇదే జాగ్రత్తలో ప్రక్కవాడి సంగతి ఎందుకు అనం? ఇది మమకారం. మన బిడ్డ విషయంలో జాగ్రత్త తీసుకుంటాం, అదే ఇతరుల బిడ్డ అయితే జాగ్రత్త తీసుకోము. నువ్వు 10 రూపాయల వస్తువుకి 100 రూపాయలు ఇవ్వవచ్చు. నువ్వు అది 90 రూపాయలే అనుకొని 10 రూపాయలు తిరిగి తెచ్చుకోవచ్చు. నీకు తెలియనంత మాత్రాన అంతే తీసుకొని వాడు పంపించకూడదు. నువ్వు పొరపాటున వెళుతున్నా, వాడు "ఏమండోయ్ ఇంకా చిల్లర ఇస్తున్నానండీ, 90 రూపాయలు కాదు దీని విలువ, 10 రూపాయలే, ఇంకా 90 రూపాయలు ఇస్తున్నాను, ఆగండి అని చెప్పాలి" అని చెప్పి ఇయ్యాలి. అది గదా ధర్మం. ఎందుకని? నీకు తెలియని చోటుకి వెళ్ళి నువ్వు 100 రూపాయలు పెడితే వాడు 10 రూపాయల వస్తువుకి 90 రూపాయలు నీకు తెలియదు గదా అని చెప్పి వాడు తీసుకోవాలనా నీ ఉద్దేశ్యం? అది కాదు కాబట్టి నువ్వుకూడా ఇలా చెయ్యాలి. అందుకని మహాత్ముల చరిత్రలు చదువుకుంటే మాత్రమే తెలిసే విషయాలు కొన్ని ఉన్నాయి.

అజిమీర్ దగ్గర ముస్లిమ్స్ అక్కడ పరిపాలిస్తుండే కాలంలో గొప్ప మహాత్ములుండేవారు. ఆయన దగ్గరకు యువరాజు వచ్చాడు. రాజకుమారుడు

వచ్చి ఆయన మహిమంతా చూశాడు. కొన్ని వేలమంది వచ్చి (పేదవారు) లేదనకుండా భోంచేసి పోతుండేవారక్కడ. ఆ భోజనశాలలో, అది చూశాడు. చూసి "స్వామీ ఇంత మహత్తరమయిన భగవత్ లీల జరుగుతోంది మీ ద్వారా, ఇంతమంది సంతోషపడుతున్నారు. కాబట్టి ఒక లక్ష దినార్‌లు మీకిచ్చేస్తాను" అంటే ఆయనన్నాడు. "నీ వయస్సెంత?" నాకు పద్నాలుగు అన్నాడు. "నువ్వు పనికిరావు ఇవ్వడానికి. ఈ బుద్ధి నువ్వు 21వ సంవత్సరం దాకా ఉంచుకో, అప్పుడు తీసుకురా తీసుకుంటా, లేకపోతే వదిలెయ్." జాగ్రత్తగా వినండి. మీరు ఆలోచించు కోగలిగినంత దూరం వస్తుంది. నే చెప్పే ఉదాహరణ. ఒక్కొక్కళ్ళ జీవితంలో ఒక్కొక్క సన్నివేశం చివరిదాకా వస్తుంది. అన్వయించుకొనేచోటికి జాగ్రత్తగా ఆలోచించుకోండి. 14 ఏళ్ళ పిల్లవాడు వచ్చాడు, అయితే రాజకుమారుడు, వాడు ఏం చెబితే కాదు? నాయనా, నాయనా, మా మిత్రుడు వాడికి ఒక ఏనుగు ఇయ్యి, అంటే ఇచ్చేస్తాడు. వాడికంత డబ్బు ఉంది, హోదా ఉంది. అధికారం ఉంది(రాజుకు), బిడ్డమీద మమకారం ఉంది. వీడు ఏమన్నాడు. ఇంత మహత్తరమయిన కార్యం జరుగుతోంది. ఇన్ని వేలమందికి మీరు భోజనాలు పెడుతున్నారు. ఇంత సేవ జరుగుతోంది కాబట్టి ఒక లక్ష దినార్లు మీకు నేను ఇచ్చేస్తాను. అంటే ఆయనన్నాడు, నీ వయస్సెంత అన్నాడు. నాకు 14 ఉంటాయి అన్నాడు. "అట్లా కాదు, నీకు మంచి ఉదారబుద్ధి ఉంది, చాలా సంతోషం. కానీ ఇదే బుద్ధిని 21 వ సంవత్సరం వరకూ ఉండాలని భగవంతుని ప్రార్ధన చేసుకుంటూ ఉండు. అప్పుడు ఉంటే, అప్పుడు తీసుకొచ్చి ఇయ్యి, తీసుకుంటాను." ఇప్పుడు నీకిచ్చే హక్కు లేదు పో! అన్నాడు. మా నాన్నని అడిగొచ్చి ఇస్తా అన్నాడు. అట్లా ఇవ్వాల్సింది కాదు, మీ నాన్న వచ్చి చూసినపుడు మీ నాన్నకు ఇవ్వాలనిపిస్తే ఆయన ఇస్తాడు. సూక్ష్మం చూడండి ఎలా ఉందో. అంతేకానీ మీ అబ్బాయిగారు వచ్చి లక్ష దినార్లు ఇస్తానన్నారు కాబట్టి లక్ష దినార్లు పంపించవలసింది, బిల్లు పంపించడం కాదు అక్కడ. అందులో ధర్మశాస్త్రం ఏమిటి, వాడు స్వతంత్రుడు కాలే. వాడు స్వతంత్రుడు కానంతవరకూ దాన ధర్మాలకు వాడికి హక్కులేదు. వాడు ఇస్తే వాళ్ళనాయన సొత్తుగదా ఈయబోతాడు, అది ఇవ్వడమా, ఇయ్యకపోవడమా ఆలోచించు కోవలసింది వాళ్ళనాయన. అందులోంచి వాడు కావలసినంత తినచ్చు. కావలసినంత ఆనందించవచ్చు. అంతవరకే. అంతకుమించి వాడికి హక్కేం

లేదు. వాడు చేసిన దానం వాళ్ళ నాయనకు ఇష్టం లేకపోతే, పాపం క్రింద లెక్క వస్తుంది. అందుకనే బాబా అంటారు, నీకు ఇవ్వాలనిపించకపోతే ఎవ్వరికీ ఏమీ ఇవ్వనవసరం లేదు. నూనె కోసం అడుక్కుంటానికి పోతే, వాళ్ళు లేదు, లేదు పొమ్మంటే, నీళ్ళు పెట్టి దీపాలు వెలిగించిన తరువాత, అప్పుడు అంటాడు ఒరేయ్! నీకు ఇవ్వాలనిపించకపోతే మాత్రం ఏమీ ఇవ్వనక్కర్లేదురా, కానీ అబద్దం మాత్రం చెప్పొద్దు, లేదని మాత్రం చెప్పొద్దు. నాకు ఇవ్వబుద్ధి పుట్టలేదని చెప్పు, నేను ఇవ్వనని చెప్పు, బాగానే ఉంది, అది కూడా! లేదని చెప్పాల్సిన అవసరం ఏముంది? అవి అంత సూక్ష్మం కలిగినవన్నమాట. వాడికి (రాజకుమారుడికి) ఏ హక్కూలేదు. అందుకని అన్నాడు నీకు 21 వ సంవత్సరం రానీ. ఎందుకంటే, ఆ కాలంలో 18, 20 దాటితే తప్ప వాడు స్వతంత్రుడు అయినట్లుకాదు. అప్పుడు రేపు వాడికి పట్టాభిషేకం చేయబోతారు అని నిర్ణయం అయిన తరువాత వాడికి కొంత హక్కు వస్తుంది. అందులో వాడు దానం చేయవచ్చు మళ్ళా. అంత గిరి ఉండేదన్నమాట దాని వెనకాల. అంతేకానీ రాజకుమారుడు వచ్చాడు. లక్ష దినార్లు ఇస్తానన్నాడు. కాబట్టి మనం అన్నదానం ఇంకా బ్రహ్మాండంగా చేయచ్చు, పుచ్చుకుంటాలే అనిగాదు వారు చేసింది. ఏం చేయాలి పుచ్చుకొని? అందుకని ఇవి ఇచ్చే హక్కు నీకు లేదు. తీసుకెళ్ళిపో! ఆధ్యాత్మికతలో ఇవి అడుగడుగునా, అడుగడుగునా, ఇటువంటి అవకాశాలు వస్తాయి. అవతలవాణ్ణి నిలువునా ముంచెయ్య వచ్చన్నమాట. అంత బ్రహ్మాండమయిన అవకాశాలు వస్తాయి. అంటే మనల్ని మనం ముంచేసుకుంటామా, లేక తేల్చుకుంటామా అనేదే ఆ సంగతి.

హైదరాబాద్‌లో నేను వివేకవర్ధనిలో పనిచేస్తుంటే నైజాం నవాబుగారి ముని మనవళ్ళలో ఒకడు నా దగ్గర చదువుకొనే వాడు, జరీద్ అహమ్మద్ అని. వాడొక పెద్ద అడ్వకేట్ ఇప్పుడు. అడ్వకేట్ మాత్రమే కాకుండా బోళ్డన్ని టాక్సీలు అవి రన్ చేస్తుంటాడు. వాడికున్న సొంత స్థలాలలో నెహ్రు జువలాజికల్ పార్కు స్థలం, సగభాగం లేదు. అది మొత్తం స్టేట్ గవర్నమెంటు తీసుకుంది. తీసుకున్న తరువాత వాడికి కాంపెన్‌సేషన్ క్రింద రావలసింది, భయంకరంగా ఉంది. అంత పెద్ద మొత్తం. అతి చవక క్రింద లెక్కవేస్తేనే, వాడికి కాంపెన్‌సేషన్ క్రింద రావలసినది చాలా పెద్ద ఎమౌంట్. ఒక పట్టాన ఇచ్చి చావదు ప్రభుత్వం. వాడేం

చేశాడంటే నువ్వు సాయిబాబా, సాయిబాబా అంటున్నావు కదా, నాకు ఇన్నిచోట్ల, ఇన్నిన్ని ప్లాట్లు ఉన్నాయి. ఇందులో ఒక్క రెండు ప్లాట్లు మీద డబ్బుగానీ వస్తే ఈ మధ్యకాలంలో మెహర్బానీల కోసం చేసిన అప్పులన్నీ తీరిపోతాయ్. కొన్ని కారణాలవల్ల అప్పులయ్యాయి. ఆ రెండు ప్లాట్లు మీదన్నా కాంపెన్‌సేషన్‌గా వచ్చే డబ్బు వస్తే ఈ అప్పులన్నీ తీరి మళ్ళా మిగిలిన వాటిమీద వచ్చేదాకన్నా పరువుగా బ్రతకొచ్చు. ఆ సంగతి నేను బాబాతో చెబితే, వాడు రెండడిగితే, ఈయన మూడిటికి ఇప్పించారు. అప్పుడు వాడొచ్చి ఏమన్నాడంటే మనం రెండే అడిగాము బాబాను, ఆయన మూడిటికి ఇచ్చారు. ఓ! నా అవసరం కంటే చాలా ఎక్కువుంది. అందుకని ఒక పని చేద్దాం అన్నాడు. ఏంచేద్దాం? అన్నాను. ఒక లక్ష నీపేరు మీద పెడతాను అన్నాడు. అంటే చెప్పాను వద్దులే, నీ పేరుమీద ఉండనీ, ఎప్పుడన్నా నాకు కావాలంటే ఇద్దువుగానీ అన్నాను. ఆ! అట్లా ఎట్లా? నాపేరొకటి, నీ పేరొకటీనా అన్నాడు. నేను ఇంతకుముందు నీ వద్ద ఎంతో అప్పుకూడా చేశాను కాబట్టి ఈ లక్షా తీసుకో అని అన్నాడు. నేను బాబాని శిరిడీలో అడిగి చెబుతాను అన్నాను. ఎప్పుడు అడుగుతావు అంటే, ఇంచు మించు ఆరునెలలు time పట్టచ్చు నేను శిరిడీ వెళ్ళడానికి. కాబట్టి ఆరుమాసాల తరువాత రా చెబుతాను అన్నాను. అప్పటినుండి ఇప్పటిదాకా మళ్ళా కనిపించలా అంటే ఏమిటన్నమాట? ఆ లక్షరూపాయల కోసం ఒక లక్ష జన్మలు మనల్ని తినేస్తాడు మళ్ళా తరువాత. ఇప్పుడు బాగానే ఉన్నాంగా, తింటున్నాంగా రెండు పూట్లా, వాడు లక్ష ఇవ్వకపోయినా తింటూనే ఉన్నాంగా? కొన్ని జన్మలపాటు భుక్తీ, గిక్తి ఉండదు అన్నమాట. ఎందుకంటే వాడికి బుద్దిమారుతుంది మళ్ళా. ఎందుకిచ్చాంరా? అనుకుంటాడు తరువాత. అనుకున్న రోజున మనకీ వాడికీ బుణానుబంధం తగులుకుంటుంది.

నేను మీ ఇంట్లో సంచి పెట్టుకుంటాను, నాలుగురోజులు మీ ఇంట్లో ఉంటాను అని వచ్చాడు. మూడవ రోజుకల్లా పోలీసులు వచ్చారు. వాడు ఒకరింట్లో బందిపోటు దొంగతనం చేసివచ్చాడు, వాడు మీ ఇంట్లో ఉన్నాడు. వాడితో మీకు ఏమైనా వాటా ఉందా? అని తీసుకెళ్ళారు వాడితోపాటు. ఇదెక్కడ గొడవ, ఎవడు పడతాడిది? మనకి వద్దే వద్దు, మనింట్లో వాడు సంచి పెట్టావద్దూ. అప్పుడు భగవంతుడు ఇచ్చే ఎరుక అది ఆ time కి టక్కున బ్రిలియంట్‌గా

ఐడియా ఇస్తాడన్నమాట. ఒక ఆరుమాసాలు ఆగు అంటే, ఆరుమాసాల తరువాత కనిపిస్తేగా వాడు. మొట్టమొదటిసారిగా మొన్న హైదరాబాదు పోయినపుడు నేను అబిడ్స్‌లో పాతపుస్తకాల షాపుల వద్ద రోడ్డు క్రాస్ చేస్తుంటే టక్కున మనిషి పట్టుకున్నాడన్నమాట. చూస్తే వీడు. ఓ! ఎలా ఉన్నావ్ అన్నాడు. బాగున్నాను. ఆ లక్షరూపాయలకి వడ్డీ బాగా వస్తున్నదా? అన్నాను. తలవంచుకొని నవ్వి వెళ్ళిపోయినాడు. ఎందుకు చెప్పుకొచ్చానంటే ఇది, స్వతంత్రుడు గనుక వాడు ఇచ్చే హక్కు ఉంది. వాడు (రాకుమారుడు) స్వతంత్రుడు కాడు, కాబట్టి వాడికి ఇచ్చే హక్కు లేదు. వాడు ఇచ్చేసినా కూడా వాళ్ళ నాన్నకి ఇష్టం లేకపోతే లాభం లేదు. రేపొద్దున వీడు ప్రయోజకుడైనాక వీడికి ఇవ్వాలన్న బుద్ధి ఉంటుందన్న నమ్మకం ఏంటి? ఉండదు. ఉండకపోతే ఇవ్వకపోనీ. అందుకనే ఏమవుతుందంటే ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చాక అన్ని పరీక్షలు ఉంటాయి. అగ్ని పరీక్షలు నడుస్తాయి. దానికి నిలబడకుండా అట్లా ఊగాడో? ఆయనకీ(బాబాకీ) వీడికీ రాం రాం. ఆ ప్రపంచం వేరు. ఈ ప్రపంచం వేరు. రూట్లు మారిపోతాయి పూర్తిగా. అందుకని భగవద్గీతలో సత్వగుణము, దైవీసంపద అని ఏవైతే చెప్పారో, అందులో ఏముంది? సత్యముంది, ధర్మముంది, ప్రేమ ఉంది. ఇలాంటి గుణాలన్నీ అందులో ఉన్నాయి. శీతోష్ణాలయందు సమంగా ఉండడం, మానావమానాలయందు సమంగా ఉండడం, తన పర బేధం లేకుండా సర్వ జీవుల శ్రేయస్సు కోరడం, ఇటువంటి గుణాలన్నీ కలసి దైవీసంపద, సత్వగుణము అంటున్నాము. అటువంటివి అలవరచుకున్న వాడికి మాత్రమే ఆత్మజ్ఞానం సాధ్యము అని భగవద్గీత స్పష్టంగా చెబుతోంది. అవి ఉన్నవాడి జీవితం ఎట్లా ఉంటుంది, అవి లేని వాడి జీవితం ఎట్లా ఉంటుంది. ఈర్ష్య ఉండకూడదు, అసూయ ఉండకూడదు, ద్వేషం ఉండకూడదు, అందరియందు ప్రేమ ఉండాలి, సత్యముండాలి, నిర్భయ ముండాలీ, ఇవన్ని ఉండాలి. సత్వగుణం, దైవీసంపద లక్షణాలు అని చెబుతున్నాడు. ఇవి ఉన్నవాడికి మాత్రమే ఆధ్యాత్మికత రక్తి కడుతుందన్నాడు. ఈ సత్వగుణం లేకుండా అన్నీ నేనే పాముకుందాం అనే ఆశ ఉన్నవాడు ఇంద్రాది పదవులు పొంది, మనం ఎంత కష్టపడుతున్నామో వాడూ అంతే కష్టపడుతాడు. ప్రక్క వాళ్ళు ఎందుకు బాగుండాలి అనేటటువంటి రాక్షసగుణం ఉండేవాడు ఉన్నాడే, తపస్సుచేసి ఈశ్వర సాక్షాత్కారం అయ్యాక పదిమందికి

కీడు చేశాక వాడు చచ్చిపోతున్నాడు ఎట్లాగూ. అట్లా కాకుండా బ్రహ్మజ్ఞానం పొంది, పొందాల్సిందంతా పొందినవాడు ఎవడు? ఇవన్నీ ఉన్నవాడు. కానీ ఇవన్ని ఉన్నవాడు జీవితంలో ఎట్లా ఉంటాడు? ప్రాపంచిక జీవితంలో అన్ని జీవుల పట్లా తనకుండేటటువంటి ధర్మాన్ని త్రికరణశుద్ధిగా పాటిస్తాడు. ఎందుకు పాటిస్తాడు? రేప్పొద్దున్న నాకేదో ఒరుగుతుందని కాదు. ముక్కోటి దేవతలున్నారు మన శరీరంలో. ముక్కోటి దేవతలు ఉన్నారు ప్రతివాడి శరీరంలోనూ, మనసుతో పని చేస్తూ వాళ్ళతో వ్యవహరిస్తున్నాను అని గుర్తుపెట్టుకో. అందుకని ధర్మం అంత తూ.చ. తప్పకుండా ఉంటానికి వీలుంది. ఇందాకా, నా దగ్గరుండే రామారావు వచ్చి ఎవరి సంగతో చెప్పాడు. ఆధ్యాత్మికత మాట్లాడతాడు, వేదాంతం మాట్లాడతాడు. ఎవరినో గురువుగా, దైవస్వరూపంగా నమ్మాను అంటాడు. అన్నీ అంటాడు. ఇంట్లో కూరలు లేవంటే తేడూ, బియ్యం అయి పోయాయంటే తేడూ, జబ్బుచేసిందంటే మందిప్పించడూ, రిక్షా దొరక లేదంటే మీకు ప్రాప్తం లేదు అంటాడు, కానీ వెళ్ళి రిక్షా పిలవడు. ప్రమాదంగా జబ్బుచేసింది ఆస్పత్రిలో ఇమీడియట్‌గా ఎడ్మిట్ చేయాలి బిడ్డను, తల్లి గోలపెట్టేస్తోంది, రిక్షా ఉందేమో చూడమంటాడు గేటు దగ్గర, లేదంటే భుజం మీద వేసుకొని తీసుకుపో అన్నాడు. అదేమిటంటే ఈ బుణానుబంధాలు, ఇవన్నీ ప్రపంచానికి సంబందించినవీ, ఇవి ఎంతసేపు? ఇవి అశాశ్వతము. నేను పరమార్ధంలో ఉన్నాను. అందుకని నేను బయటకు వచ్చి చూడను, ఇవన్నీ అన్నాడు. మరి అయితే అన్నం ఎందుకు తింటున్నావు రోజూ? ఇది ఆధ్యాత్మికతని ఆయన ఉద్దేశ్యం. అదే గనుక నిజం అయితే అన్నం ఎందుకు తింటున్నాడు. కంచం అక్కడ పెట్టుకొని ఆకాశంలోంచి అన్నం పడితే తినేది, లేకుంటే ఊరుకునేది. పెట్టమని ఎందుకు అడగాలి ఇంట్లో? ఇడ్లియో, కాఫీయో ఇవ్వమని ఎందుకు అంటాడు ఇంట్లో. ఆకాళంకేసి చూసి పరబ్రహ్మస్వరూపమా కాఫీ అని అడగాలి. వస్తే తాగాలి, లేకుంటే ఊరుకోవాలి. పరబ్రహ్మస్వరూపమా అన్నం కావాలి. పెడితే తినాలి, లేకుంటే ఊరుకోవాలి. అప్పుడు మాత్రం భార్య కావాలా? కాఫీ కావాలా? టిఫిన్ కావాలా? మందిప్పించడానికి, ప్రాపంచికమైన బాధ్యత దగ్గరకి వచ్చేటప్పటికి మాత్రం పరమాత్మ వేరు. నారుపోసిన వాడే నీరు పోస్తాడా? ఇదంతా స్వార్ధము, ఆత్మవంచన. ఇది ఆధ్యాత్మికత క్రింద ప్రపంచంలో నేడు చెప్పబడుతోంది.

సాయినాథుడు మనకి చేసిన మేలేమిటంటే ఇంత కష్టపడి, ఇంత ఆలోచించి ఇంత చర్చించి, ఈ విషయాలన్నీ ధర్మశాస్త్రం అంతా కష్టపడి చదవాల్సిన అవసరం లేకుండా, ఇన్ని పురాణాలు, వేదాలు చదవాల్సిన అవసరం లేకుండా, ఇప్పుడు భగవత్ప్రచారం చేస్తున్న వాళ్ళందరూ ఎక్క డైతే తిమ్మిని బొమ్మెను చేసి తారుమారు చేసి చెబుతున్నారో, ఆ బోధ అర్థం చేసుకోవలసిన అవసరం లేకుండా, సాయినాథుని చరిత్రలో ఈ సారం మొత్తం వస్తోంది. నేను అన్ని జీవులరూపంలో ఉన్నాను రా అని, నువ్వు దేనిని బాధపెట్టినా నాకే చెందుతుంది. నువ్వు దేనిని ఆదరించినా నాకు చెందుతుంది అన్నారు. అది గుర్తుపెట్టుకొంటే ఇప్పుడు నేను చెప్పినవన్నీ అయిపోతాయి.

ఎవరైనా అడుగు తారన్నమాట. ఇదివరకూ పెద్దలు చెప్పారే ఆ ప్రకారం, ఆ దేవతలు వాటిని పూజిస్తే ఎక్కువ గొప్పదా, ఈయనను పూజిస్తే ఎక్కువ గొప్పదా? ఇట్లా ఎందుకు చేయాలి అని అడుగుతారన్నమాట. ఇప్పుడు చెప్పు. ఈ నిదర్శనం ఇచ్చినదెవరో చెప్పు. ఈ ఒక్కమాట నేర్చుకొంటే ఈ రెండుగంటల సేపు చెవులుకోసిన మేకల్లే నేను ఇప్పటిదాకా వాగింది మొత్తం, ఆ ఒక్కటే వాక్యంలో, ఒక్క లీలలోనే ఉంది. కుక్కలో, పిల్లిలో, చీమలో, దోమలో అన్నిట్లో నేనున్నాను. నువ్వు కుక్కను కొట్టినా నాకు తగులుతుంది, నువ్వు పిల్లిని కొట్టినా నాకు తగులుతుంది. నువ్వు బిచ్చగాడికి పెట్టినా నాకు చెందుతుంది, ఇంట్లో నైవేద్యం పెడితే నాకు చెందుతుంది, మర్చిపోతే నాకు తెలుస్తుంది అన్నారనుకోండి. అప్పుడు అన్ని జీవరాసులతోనూ ఎట్లా ఉండాలో అట్లా ఉండడం జరుగుతుంది ఆ ఒక్కటీ గుర్తు పెట్టుకుంటే. ఇన్ని తెలుసుకున్నాక ప్రపంచం అంతా మెట్టవేదాంతంలో ఎట్లా పడుతుందో అట్లా బ్రష్టు పట్టకుండా సరైన ఆధ్యాత్మికత నీకు తెలుస్తుంది. (ఆ గుర్తుతో) నువ్వు నడిచేదే ధర్మం అవుతుంది. నువ్వు నడిచేదే ధర్మార్థ కామ మోక్షాలు నాలుగు అందులో కలిగి ఉన్నాయి. మన సంసారం ఉంటుంది, మన ఉద్యోగం ఉంటుంది, మన బాధ్యతలు ఉంటాయి. ఇవన్నీ నెరవేర్చుకుంటూ ఉంటాము, ఇందులో కష్టసుఖాలు కూడా ఉంటాయి అన్నిటితోపాటు. ఇట్లా ఉన్నాం కాబట్టి అన్ని సుఖాలే ఉండటం జరగదు. కష్టసుఖాలు రెండూ ఉంటాయి. వాటిని సమంగా చూచుకుంటూ పోవడమే. అదే ఆధ్యాత్మికత. లౌకిక జీవనము లేకుండా ఆధ్యాత్మికత అసంభవం.